

ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 1-10-2026 | సంపుటి - 31 | సంచిక - 129 | రూ : 4 | పేజీలు: 8



హైదరాబాద్‌కు దిగ్గజ అమెరికా సంస్థ

'డోర్ డాష్'

- భారత్‌లో తొలి కార్యాలయం ఏర్పాటు
- తొలిదశలో 500 మందికి ఉద్యోగావకాశాలు
- రెండేళ్లలో 3,000 మందికి విస్తరణ
- కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రముఖ లోకల్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'డోర్ డాష్' భారత్‌లో తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. ప్రస్తుతం 500 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ... వచ్చే రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 3,000 మందికి పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రంలో ప్రారంభ దశలో కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ఇంటెగ్రిటీ (సీఎక్స్ఐ), జనరల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు పనిచేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా సంస్థకున్న అంతర్గత సీఎక్స్ఐ సర్వీస్ సెంటర్లలో హైదరాబాద్‌లోని కేంద్రం మూడోది. అమెరికాలోని టెంపీ, అలాగే మెక్సికోలోని మెక్సికో సిటీ తర్వాత హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా తమ తరువాయి 2లో

మీకు ఫామ్‌హౌస్‌లు

ఎక్కణ్నుంచి వచ్చాయి?

మీ కుటుంబసభ్యులందరి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయండి

- కేటీఆర్‌ను డిమాండ్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- హైటెక్ సిటీ వద్ద కేటీఆర్ కుటుంబానికి మూడు ఫైవ్ స్టార్ హోటళ్లున్నాయని ఆరోపణ
- సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారని మండిపాటు
- నేతన్నల ఆత్మహత్యలు, వలసలు ఎందుకు ఆపలేకపోయారని నిలదీత



2లో



ఇకపై ఇంటర్నెట్ లేకుండానే

మొబైల్‌లో లైవ్ టీవీ..!


- D2M టెక్నాలజీ అమలుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు
- వాణిజ్య అమలు కోసం అక్టోబర్‌లో RFP జారీ
- మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం

మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్‌టుమొబైల్' (D2M) అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు. ఏంటీ D2M టెక్నాలజీ? D2M అనేది బ్రాడ్‌కాస్టింగ్, తరువాయి 2లో

ఏపీలో SIR గడువు

అక్టోబర్ 10 వరకు పొడిగింపు

- అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం
- అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం
- కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం



ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార తరువాయి 2లో

రష్యా సైన్యంలో చేరొద్దు

కేంద్రం హెచ్చరిక

- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ

2లో





క్రాకర్స్‌పై సుప్రీం ఊరట..

పూర్తి నిషేధం కాదు!

- 24 గంటల పాటు కాల్చేందుకూ అనుమతించలేని స్పష్టీకరణ
- నిర్దిష్ట సమయాలపై నిబంధనలు వచ్చే అవకాశం
- గ్రీన్ క్రాకర్స్‌కు షరతులతో అనుమతికి సూచన
- బేరియం క్రాకర్స్‌పై సీపీసీబీ నివేదిక పెండింగ్
- తదుపరి విచారణ అక్టోబర్ 15న

దీపావళి వేళ బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాణసంచాపై పూర్తిగా నిషేధం విధించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో రోజంతా ఎలాంటి పరిమితులు లేకుండా కాల్చేందుకు కూడా అనుమతించలేమని తేల్చి చెప్పింది. తరువాయి 2లో

యూఎస్ వీసా పిడుగు

డబుల్‌కైన ఇన్వెస్టర్ ఫీజులు!

- అమెరికా ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ నిర్ణయం
- భారతీయ పెట్టుబడిదారులలో గ్రీన్ కార్డ్ కోసం ఇది ఒక మార్గం
- కొన్ని దరఖాస్తు ఫీజులు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిన వైనం



2లో

మోదీ-ట్రంప్ ఫోన్ కాల్

వాణిజ్యం, రక్షణపై చర్చ

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహితసంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం



ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్ అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. తరువాయి 2లో

మీకు ఫామ్‌హౌస్‌లు ఎక్కణ్నుంచి వచ్చాయి?

సిరిసిల్ల: కేటీఆర్ తన ఆస్తులతో పాటు.. కేసీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావు ఆస్తులపై కూడా శ్వేతపత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ''సిరిసిల్ల భూములపై కేటీఆర్ శ్వేతపత్రం అడుగుతున్నారు. మీది.. మీ తండ్రిది.. సంతోష్‌రావు, హరీశ్‌రావు, మీ బంధువుల ఆస్తులపై శ్వేతపత్రం ఇవ్వండి. జన్వాడలో కేటీఆర్ ఫామ్‌హౌస్, శంకర్‌పల్లిలో కవిత ఫామ్‌హౌస్, మొయినాబాద్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌస్, ఎర్రవల్లిలో కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్నాయి కదా? ఇవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయి?'' అని సీఎం ప్రశ్నించారు. హైటెక్ సిటీ వద్ద కేటీఆర్ కుటుంబానికి మూడు ఫైవ్ స్టార్ హోటళ్లున్నాయని, దాదాపు 400 రూములుండే ఈ హోటళ్లు ఎక్కడ్నించి వచ్చాయో కేటీఆర్ సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్, కేటీఆర్, సంతోష్‌రావులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారని మండిపడ్డారు.అంతకుముందు సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుంచి రంగినేని ట్రస్ట్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వరకూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు, పార్టీ నాయకులు, వందల మంది కార్యకర్తలతో కలిసి సుమారు 3 కి.మీ. పాదయాత్ర చేశారు. అనంతరం సభా వేదిక వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బహిరంగసభలో సీఎంతోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహమ్మద్ అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఓట్లను నోట్లుగా మార్చుకున్నారు..

సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. ''ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల. వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా. వేల కుటుంబాల వారు చేనేతను నమ్ముకొని జీవిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారిది. కానీ పదేళ్ల భారాస పాలనలో సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చేశారు. సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డి ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని నిర్మించారు. 2009 ఎన్నికల్లో ఆయనకు న్యాయంగా టికెట్ ఇస్తే.. 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిచేవారు. కానీ కేసీఆర్... తన కుమారుడిని బరిలో నిలిపారు. బొటాబొటీగా 172 ఓట్లతో కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యారు. మీరు వేసిన వేలాది ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకొని.. వందల ఎకరాల భూములను సమకూర్చుకొని.. ధనిక కుటుంబంగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమాన్ని, సిరిసిల్ల ప్రజల శ్రమను సంపదగా మార్చుకొని.. విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. 2009 నుంచి 2026 వరకూ ఇక్కడ ఆరుసార్లు ఎన్నికల్లో మీరు కేటీఆర్‌ను గెలిపించారు కదా? మరి నేత కార్మికుల ఆత్మహత్యలు, గల్ఫ్ వలసలను ఎందుకు ఆపలేకపోయారు? మా ప్రభుత్వం వచ్చాక.. గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టాం. కార్మికులు గల్ఫ్ ప్రాంతాల్లో చనిపోతే.. ఆ కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందజేసే పథకాన్ని తెచ్చాం.

*** సంతోష్‌రావు ఆగర్భ శ్రీమంతుడు ఎలా అయ్యారు?**

కేటీఆర్, కేసీఆర్ తోడల్లుడు రవీందర్‌రావు, ఆయన కుమారుడు సంతోష్‌రావులు రూ.లక్షల కోట్ల సంపద దోపిడీ చేసింది వాస్తవం కాదా? ఇసుక లారీలకు అడ్డం వచ్చారని దళిత సోదరులను లారీలతో తొక్కించింది నిజం కాదా? ఆ బలహీన వర్గాల పిల్లలకు కరెంటు షాక్ ఇచ్చింది నిజం కాదా? మిడ్‌మానేరులో ఇల్లు పోయిందని.. 2015లో రవీందర్‌రావు, సంతోష్‌రావు, సౌమ్యారావు.. ముంపు బాధితుల ప్యాకేజీ సొమ్మును కొల్లగొట్టారు. తెల్ల రేషన్‌కార్డు తీసుకొని ఇళ్ల పట్టాలు పొందారు. అలాంటి సంతోష్‌రావు ఇప్పుడు ఆగర్భ శ్రీమంతుడెలా అయ్యారు? వందల ఎకరాల భూములు, టీవీ, పేపర్లు, ఫైవ్ స్టార్ హోటళ్లు ఎలా వచ్చాయి?

ఇకపై ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టీవీ!

మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్‌టుమొబైల్' (D2M) అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు.

ఏంటీ D2M టెక్నాలజీ?

D2M అనేది బ్రాడ్‌కాస్టింగ్, బ్రాడ్‌బ్యాండ్ కలయికతో పనిచేసే సాంకేతికత. దీని ద్వారా ఎలాంటి ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే లైవ్ టీవీ, వీడియోలు, ఇతర మల్టీమీడియా కంటెంట్‌ను నేరుగా మొబైల్స్‌కు ప్రసారం చేయవచ్చు. ముఖ్యంగా ఇంటర్నెట్ సిగ్నల్స్ బలహీనంగా ఉండే గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రసార భారతి, ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్ (గతంలో సాంఖ్య ల్యాబ్స్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. వాణిజ్యపరమైన అమలు కోసం అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (RFP) జారీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 470 582 MHz స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ఈ ప్రసారాలు జరుగుతాయని, దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు. అయితే, ఈ టెక్నాలజీ విస్తృత వినియోగానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. D2M ప్రసారాలను స్వీకరించేందుకు ఫోన్లలో ATSC 3.0 ప్రమాణాలకు అనుగుణమైన హార్డ్‌వేర్ ఉండాలి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చాలా స్మార్ట్‌ఫోన్లు దీనికి సపోర్ట్ చేయవు. మరోవైపు, ఈ టెక్నాలజీ వల్ల తమ డేటా ఆదాయానికి గండి పడుతుందని టెలికాం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

హైదరాబాద్‌కు దిగ్గజ అమెరికా సంస్థ 'డోర్ డాష్'

హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రముఖ లోకల్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'డోర్ డాష్' భారత్‌లో తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. ప్రస్తుతం 500 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ... వచ్చే రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 3,000 మందికి పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రంలో ప్రారంభ దశలో కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ఇంటెగ్రిటీ(సీఎక్స్ఐ), జనరల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు పనిచేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా సంస్థకున్న అంతర్గత సీఎక్స్ఐ సర్వీస్ సెంటర్లలో హైదరాబాద్‌లోని కేంద్రం మూడోది. అమెరికాలోని టెంపీ, అలాగే మెక్సికోలోని మెక్సికో సిటీ తర్వాత హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలకు హైదరాబాద్ కేంద్రం కీలకంగా వ్యవహరించనుందని సంస్థ ప్రకటించింది. వినియోగదారులు, వ్యాపారులు, డెలివరీ భాగస్వాములకు మెరుగైన సేవలు అందించడంలో ఇది క్రియాశీలకంగా వ్యవహరించనుంది. డోర్ డాష్ ప్లాట్‌ఫామ్‌కు ప్రపంచవ్యాప్తంగా 5.6 కోట్లకు పైగా నెలవారీ యాక్టివ్ వినియోగదారులున్నారు. 40కిపైగా దేశాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2025లో సంస్థ మార్కెట్‌ప్లేస్ గ్రాస్ ఆర్డర్ విలువ 100 బిలియన్ డాలర్లకు పైగా నమోదైంది. హైటెక్ సిటీలో సంస్థ కార్యాలయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం ప్రారంభించారు.

*** 2029 నాటికి జీసీసీల్లో 10 లక్షల ఉద్యోగావకాశాలు!**

ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ''ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 500 జీసీసీలున్నాయి. మరో 100 దాకా ఏర్పాటు చేసి.. లక్షకు పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు, 3 లక్షలకు పైగా పరోక్ష ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని జీసీసీల్లో 5 లక్షల మందికిపైగా పనిచేస్తుండగా.. 2029 నాటికి ఈ సంఖ్య 10 లక్షలకు చేరుతుందని అంచనా. ఫార్చ్యూన్ 500 సంస్థలు, కొత్త జీసీసీలను ఆకర్షిస్తున్న భారతీయ నగరాల్లో హైదరాబాద్ కీలక స్థానాన్ని కొనసాగిస్తోంది. హైదరాబాద్ జీసీసీ ఎకోసిస్టమ్‌లోకి తాజాగా డోర్ డాష్ ఆగమనంతో హైపర్ లోకల్ డిజిటల్ కామర్స్ రంగం కూడా చేరినట్లైంది. హైదరాబాద్‌లో డోర్ డాష్ పెట్టుబడి.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల రంగానికి ముఖ్యమైన పరిణామం. ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకోవడం..నగరంలోని ప్రతిభ, సాంకేతిక సామర్థ్యాలకు గుర్తింపు. 3,000 మందికి పైగా ఉద్యోగులతో కేంద్రం విస్తరించడం ద్వారా హైపర్ లోకల్ కామర్స్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, టెక్నాలజీ, ఆపరేషన్స్ రంగాల్లో గ్లోబల్ సామర్థ్యాలు హైదరాబాద్‌కు తరలివస్తాయి'' అని పేర్కొన్నారు. డోర్ డాష్ సీఎఫ్ఓ రవి ఇనుకొండ, వర్క్‌ఫోర్స్ స్ట్రాటజీ అండ్ టాలెంట్ ఎక్విజిషన్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ జెన్నా కోహ్నెకె, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రష్యా సైన్యంలో చేరొద్దు: కేంద్రం హెచ్చరిక

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది. అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

మోదీ-ట్రంప్ ఫోన్ కాల్: వాణిజ్యం, రక్షణపై చర్చ

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్ అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్ అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్ అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియాయూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్ అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

క్రాకర్స్‌పై సుప్రీం కీలక తీర్పు..

పూర్తి నిషేధం కాదు..!

దీపావళి వేళ బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాణసంచాపై పూర్తిగా నిషేధం విధించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో రోజంతా ఎలాంటి పరిమితులు లేకుండా కాల్చేందుకు కూడా అనుమతించలేమని తేల్చి చెప్పింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి.వరాలేతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. దీపావళితో ముడిపడిన మతపరమైన భావాలను గౌరవిస్తూనే.. వాయు కాలుష్యం వల్ల పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి ఎదురయ్యే ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.

సమయాన్ని నిర్దేశించే అవకాశం

బాణసంచా వినియోగానికి నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించే దిశగా సుప్రీంకోర్టు మొగ్గు చూపింది. ఏ రకమైన బాణసంచాను ఉపయోగించాలన్న దానిపైనా నిబంధనలు విధించే అవకాశం ఉందని తెలిపింది. తదుపరి తరం జాయింట్ గ్రీన్ క్రాకర్స్‌లో నిర్దిష్ట రకాల బాణసంచాకు అనుమతి ఇవ్వడంపై కోర్టు సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది. అయితే వాటి తయారీ విధానం, శబ్ద స్థాయి, షెల్స్ సంఖ్య, పరిమాణం, వరుసగా బాణసంచా కాల్చే మధ్య వ్యవధి వంటి అంశాలపై నిబంధనలు విధించనుంది.

బేరియం బాసంచాపై ఇంకా పరీక్షలు

బేరియం ఆధారిత బాణసంచా వల్ల పర్యావరణంపై పడే ప్రభావంపై కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నివేదికను సమర్పించేందుకు కేంద్రం మరింత సమయం కోరింది. బేరియం ఆధారిత బాణసంచాపై బహిరంగ ప్రదేశంలో పరీక్షలు ఇంకా జరగలేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. అక్టోబర్ 15 వరకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో కేంద్రం, నిపుణుల సంస్థలు తమ అంచనాలను పూర్తి చేసేందుకు సుప్రీంకోర్టు సమయం ఇచ్చింది. ఈ అంశంపై తదుపరి విచారణ అక్టోబర్ 15న జరగనుంది.

*** ఢిల్లీ-ఎన్‌సీఆర్ అంశంపై ఇప్పుడే ఆదేశాలు లేవు**

బాణసంచాపై పెండింగ్‌లో ఉన్న కొన్ని అంశాలు ఢిల్లీ ఎన్‌సీఆర్‌కు సంబంధించిన ఎం.సి. మెహతా కేసులో విచారణలో ఉన్న అంశాలతో ముడిపడి ఉన్నాయని సుప్రీంకోర్టు గుర్తించింది. ఈ అంశాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించేందుకు పార్టీలకు అనుమతి ఇచ్చింది. అవసరమైతే రెండు కేసుల్లోని ఉమ్మడి అంశాలను కలిపి విచారించే అవకాశం ఉంటుంది. అయితే ఢిల్లీఎన్‌సీఆర్ అంశంపై ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు ఇవ్వబోమని జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం కోరుతూ దాఖలైన ఇతర పిటిషన్లను మాత్రం విచారించనుంది.

యూఎస్ వీసా పిడుగు: డబులైన ఇన్వెస్టర్ ఫీజులు!

అమెరికాలో పెట్టుబడులు పెట్టి, శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) పొందాలనుకునే విదేశీయులకు, ముఖ్యంగా భారతీయులకు ఇది కీలకమైన పరిణామం. భారతీయ పారిశ్రామికవేత్తలు, కుటుంబాలు ఎక్కువగా ఆసక్తి చూపే ఈబీ5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ఫీజుల నిబంధనను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) మంగళవారం ఖరారు చేసింది. నూతన ఫీజులు ఈ ఏడాది నవంబర్ 30 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఏమిటీ ఈబీ-5 ప్రోగ్రామ్?

అమెరికాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా 1990లో ఈబీ5 ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ పథకం కింద విదేశీ పెట్టుబడిదారులు అమెరికాలోని వాణిజ్య సంస్థలలో నిర్దిష్ట మొత్తంలో పెట్టుబడి పెట్టి, కనీసం 10 మంది అమెరికన్లకు పూర్తికాల ఉద్యోగాలు కల్పించాలి. ప్రస్తుతం ఈ పెట్టుబడి మొత్తం అర్హత కలిగిన వ్యాపారంలో 1.05 మిలియన్ డాలర్లుగా, టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో అయితే 8 లక్షల డాలర్లుగా ఉంది. ఈ నిబంధనలు పాటిస్తే, పెట్టుబడిదారుడు, వారి జీవిత భాగస్వామి, అర్హులైన పిల్లలు గ్రీన్ కార్డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీలో SIR గడువు పొడిగింపు.. అధికారులకు కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నోమ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

: ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి: పీఎం సిరి తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించి, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.పాఠశాల ప్రిన్సిపాల్ డా. జె. ప్రసన్న కుమారి మాట్లాడుతూ, విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం పాఠశాల ప్రధాన లక్ష్యాలలో ఒకటని తెలిపారు. విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డి. నాగరాజు, సతీష్ కుమార్, డా. శివకృష్ణ, విష్ణువర్ధన్, షాహిద్ అక్బర్, అనిల్, నవాబ్, రమేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ

కమిషనర్ హన్మంత రెడ్డి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: స్వచ్ఛతా హి సేవా-2026 కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్షా ఏవం సమ్మాన్ శిబిరాన్ని బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవం, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తూ వారికి రక్షణ పరికరాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంత రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. విధి నిర్వహణలో కార్మికుల భద్రత కోసం తప్పనిసరిగా రక్షణ పరికరాలను వినియోగించాలని సూచించారు. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న సఫాయి మిత్రుల సేవలను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమం లో మున్సిపల్ శానిటరి ఇన్స్పెక్టర్ యాదగిరి, ఎన్విరాన్ మెంట్ శివరాం ప్రసాద్, జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నూతన వస్త్రాలు, విద్యా సామగ్రి పంపిణీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రామవరం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలైన రెండో ఇంక్లైన్, నేతాజీ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు డాక్టర్ ప్రభుదయాల్ బుధవారం నూతన వస్త్రాలు, పెన్నులు, పెన్సిళ్లను బహూకరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యాబోధన చేస్తున్న ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను డాక్టర్ ప్రభుదయాల్ అభినందించారు.

కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత

మేయర్ మూడ్ గణేష్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కార్పొరేషన్ పరిధిలోని శానిటరీ, వాటర్ సప్లై, విద్యుత్ సరఫరా, ఆఫిస్ సిబ్బంది, ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం రేయింబవళ్లు కష్టపడే పారిశుద్ధ్య, నీటి సరఫరా విభాగాల కార్మికులు తమ సొంత ఆరోగ్యం పట్ల కూడా తగిన శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సమయంలో తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొని సుమారు 300 మంది కార్మికులకు రక్తపోటు, మధుమేహం తదితర జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ సుజాత, కార్పొరేషన్, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు
తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకునేలా కృషి చేయాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి: అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకునేలా కృషి చేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పిలుపునిచ్చారు. 2027 మార్చిలో జరగనున్న మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు నియోజకవర్గాల వారిగా చేపడుతున్న పట్టభద్రుల అవగాహన సమావేశాల్లో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ సర్కిల్ గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లుముఖ్య అతిథులుగా హాజరై



పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైందని, నవంబర్ 1, 2023 లోపు గ్రాడ్యుయేషన్ పూర్తయిన పట్టభద్రులు ఈ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అన్నారు.గతంలో ఓటు వేసిన వారు కూడా మరోమారు ఓటును నమోదు చేసుకోవాలి. ఎందుకంటే గత ఎన్నికల్లోని ఓటరు జాబితా పూర్తిగా రద్దవుతుందని, నూతనంగా ఓటరు నమోదు చేసుకున్న వారితో కలిపి నూతన ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేస్తుందన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో గల పట్టభద్రులను గుర్తించి వెంటనే ఓటరు నమోదు చేయించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్, వార్డు, బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రాడ్యుయేట్ ఓటర్లను చైతన్యపరచాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి భారత పౌరుడు అయి ఉండాలని,సంబంధిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో సాధారణ నివాసి అయి ఉండాలన్నారు.క్వాలిఫైయింగ్ తేదీకి కనీసం 3 సంవత్సరాల ముందు భారతదేశంలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు.పేరు నమోదు కోసం ఫారం 18 దరఖాస్తు చేయాలన్నారు. మీరు ఇప్పటికే సాధారణ అసెంబ్లీ ఓటరుగా ఉన్నా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం ఫారం 18 ద్వారా ప్రత్యేకంగా గ్రాడ్యుయేట్ కానిస్టిట్యుయెన్సీ ఎలెక్టోరల్ రోల్ లో నమోదు కావాలన్నారు.ఫారం 18లో మీ అసెంబ్లీ ఓటు వివరాలు కూడా అడుగుతారన్నారు..మీరు పరీక్ష పాస్ అయినట్లు స్పష్టంగా ఉండాలన్నారు. ఒరిజినల్ లేదా నిబంధనల ప్రకారం అతెంటికేటెడ్ కాపీ జత చేయాలన్నారు. ఫారం 18లో ఇటీవల తీసుకున్న పాస్ పోర్టు సైజ్ కలర్ ఫోటోగ్రాఫ్ కోసం ప్రత్యేక స్థలం ఉంటుందన్నారు. ఫారం 18 లో ఈ ఫోటోను జత చేయాలన్నారు.ఇప్పటికే అసెంబ్లీ ఓటర్ గా ఉంటే ఎపిక్/ఓటరు వివరాలు కావాలని, ఫామ్ ఎయిట్ అప్లై చేయటానికి6 నవంబర్ చివర తేదిఅని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయిలో మెరిసిన మెదక్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

*** డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్**

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: హనుమకొండలో జరిగిన 12వ తెలంగాణ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో కళాశాల విద్యార్థులు ఐదు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు, ఒకటి కాంస్య పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో వరంగల్ అథ్లెటిక్ అసోసియేషన్ వారి సౌజన్యంతో ఈనెల 26, 27 తేదీలలో జరిగిన పోటీలలో కళాశాలలో బిఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బి అంజలి అండర్ 20 పోటీలలో, 5000 మీటర్ల రేస్ వాక్ లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. బి జెడ్ సి ఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి శేఖర్ 400 మీటర్ల పరుగు పందెం లో హర్డిల్స్ లో బంగారు పథకాన్ని సాధించాడని తెలిపారు. ఇదే విద్యార్థి 300 మీటర్ల ట్రిపుల్ ఛాయిస్ పోటీలో బంగారు పతకాన్ని సాధించాడు. 4x400 పరుగు పందెంలో



బంగారు పతకాన్ని సాధించాడు. అలాగే 4x400 పరుగు పందెంలో ద్వితీయ బహుమతిని సాధించి వెండి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మొత్తానికి ఎన్ శేఖర్ ఒక్కడే మూడు బంగారు పతకాలు మరియు ఒక వెండి పతకాన్ని కైవసం చేసుకుని కళాశాల స్థాయిని రాష్ట్రస్థాయిలో పతాక స్థాయిలో నిలబెట్టాడు. బి. ఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న రమావత్ సుభాష్ అను విద్యార్థి 4 x 400 పరువు పందెంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి రాథోడ్ అశోక్ 4 x 400 పరుగు పందెంలో బంగారు పతకాన్ని ,4 x 100 పరుగు పందెంలో వెండి పతకాన్ని సాధించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన సభలో కళాశాల ఇన్చార్జి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి , జాతీయస్థాయిలో వివిధ పోటీలలో పాల్గొంటూ బంగారు పతకాలు సాధిస్తూ కళాశాల కీర్తిని ఇనుమడింప చేస్తున్నారని విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గేమ్స్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ హరిత విద్యార్థులను అభినందించారు.

39 ఏళ్ల సేవలకు ఘన సన్మానం

భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా 39 ఏళ్లపాటు సేవలందించిన మాటూరి రవీందర్ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి హాజరై రవీందర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థలో సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన రవీందర్ సేవలను అభినందించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ, సహచరులతో సమన్వయం



ప్రశంసనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రామన్ వి. పాఠక్, ఏసీఎంఓ డాక్టర్ పద్మజ, ఏజీఎం (సివిల్) రవికుమార్, ఏజీఎం (ఐఈడీ) జ్యోతి, ఓసీ 2 పీఓ శ్యామ్‌సుందర్, కేటీకే 1 గ్రూప్ ఏజెంట్ ములుకుంట్ల తిరుపతి, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్‌సుందర్, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ టి. పోషమల్లు, వివిధ గనులు, విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొని రవీందర్‌కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా 'సఫాయిమిత్ర సురక్షా సన్మానం'

ప్రజాస్ఫూర్తి, షాద్‌నగర్ : పట్టణ పరిశుభ్రత కోసం నిత్యం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో అభినందనీయమని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో 5వ ఏబీ దినోత్సవం సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సఫాయిమిత్ర సురక్షా సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం కష్టపడే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం,



సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ముందస్తు ఆరోగ్య పరిరక్షణపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఇతర మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింగా నాయక్‌కు ఘనంగా సన్మానం

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: టీజీఎస్ఆర్టీసీలో 35 సంవత్సరాలపాటు డ్రైవర్‌గా సేవలందించి కొద్ర లింగా నాయక్ బుధవారం పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా నల్లగొండ డిపో మేనేజర్ మేరీ లావణ్య ఘనంగా సన్మానించారు. డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో లింగ నాయక్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీకి అందించిన సేవలను అభినందించారు, అనంతరం



టీఎన్జీవో భవనంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ ప్రవీణ్ నాయక్, జగన్ సింగ్ నాయక్, రమావత్ నాగార్జున నాయక్, నరసింహ నాయక్, ఆంబోతు లచ్చు నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, ఇస్లావత్ బద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

*** బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి మరింత కష్టపడి ముందుకు సాగాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి సూచించారు.కుత్బుల్లాపూర్ డివిజన్ (గణేష్ నగర్ డివిజన్), వెంకటేశ్వర నగర్లోని బచ్‌పన్ ఒలింపియాడ్ స్కూల్ లో టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ ఎస్జీఎఫ్. జిల్లా స్థాయి గట్కా టోర్నమెంట్ , జిల్లా స్థాయి నుండి ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక నిర్వహణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని క్రీడా మైదానాన్ని ప్రారంభించి, క్రీడాకారులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్కా కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా ధైర్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సంప్రదాయ మార్షల్ ఆర్ట్ అని అన్నారు. , ఎంపికయ్యే క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు ,నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు.

రైతుల అభివృద్ధి లక్ష్యంగా గడ్డిపల్లి రైతు సేవ సహకార సంఘం పనిచేస్తుంది

*** రైతు సేవ సహకార సంఘం చైర్మన్ గంట సుధాకర్ రెడ్డి**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : రైతుల అభివృద్ధి లక్ష్యంగా గడ్డిపల్లి రైతు సేవ సహకార సంఘం పనిచేస్తుందని సంఘం చైర్మన్ గంట సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని గడ్డిపల్లిలో బుధవారం జరిగిన రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణ సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు పొందేందుకు బడ్జెట్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రైతులకు అవసరమైన సహకారం అందించేందుకు రైతు సేవా సహకార సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. సమావేశంలో సంఘం సభ్యులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ మేడ్చల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అథ్వెల్లి గ్రామంలోని నా రెడ్డి నంద రెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, దేశభక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డుల్లో లక్షల మొక్కలు.. నర్సరీల్లో ఎండిన మొక్కలు

* **వన్ టూ నైన్ రికార్డుల్లో 1,33,619 మొక్కలు.. 13 గ్రామాల లెక్కల్లోనే భారీ సంఖ్య**
* **గతంలో లక్షలాది రూపాయలతో నర్సరీల ఏర్పాటు.. మొక్కల పెంపకం, సంరక్షణకు నిధుల ఖర్చు**
* **ప్రస్తుతం కార్యకలాపాలు నిలిచిపోయి.. కుప్పలు తెప్పలుగా ఎండిన మొక్కలు**
* **విలీన సమయంలో నమోదు చేసిన మొక్కలు ఇప్పుడు ఎక్కడున్నాయన్నదే ప్రశ్న**
* **14వ గ్రామం ఘనపూర్ లెక్కలు వస్తే మరింత పెరగనున్న మొత్తం**





మేడ్చల్, (ప్రజాస్ఫూర్తి): ఎల్లంపేట మున్సిపాలిటీలో విలీనమైన 14 గ్రామపంచాయతీల నర్సరీల్లో మొక్కల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామపంచాయతీల విలీన సమయంలో అధికారులు నిర్వహించిన వన్ టూ నైన్ (వి19) ప్రొఫార్మాలో వివిధ నర్సరీల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు ఉన్నట్లు నమోదు చేసినట్లు ఆర్టీఐ ద్వారా వెల్లడైంది. అయితే ప్రస్తుతం ఆయా నర్సరీల్లో కార్యకలాపాలు కొనసాగకపోవడంతో పాటు కుప్పలు తెప్పలుగా ఎండిపోయిన మొక్కలు దర్శనమిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

రికార్డుల్లో 1,33,619 మొక్కలు

ఆర్టీఐ ద్వారా అందిన వివరాల్లో ఇప్పటివరకు లభించిన 13 గ్రామాల సంఖ్యలను పరిశీలిస్తే.. ఎల్లంపేట్‌లో 13,790, సోమవారంలో 13,450, రాజబొల్లారంలో 7,504, కొనాయిపల్లిలో 7,500, రాజబొల్లారం తాండలో 15,400, రావల్కోల్‌లో 15,050, నూతన్‌కల్‌లో 15,975, సైదోనిగడ్డ తండాలో 14,000, బండమాదారంలో 5,000, శ్రీరంగవారంలో 12,000, మైసిరెడ్డిపల్లిలో 5,000, డబిల్పూర్‌లో 3,200, లింగాపూర్‌లో 5,750 మొక్కలు ఉన్నట్లు లెక్కలు ఉన్నాయి. ఈ 13 గ్రామాల సంఖ్యలను కలిపితే మొత్తం 1,33,619 మొక్కలు ఉన్నట్లు లెక్క తేలుతోంది. అంటే విలీన సమయంలోని రికార్డుల్లోనే భారీ సంఖ్యలో మొక్కలు ఉన్నట్లు నమోదు చేసిన పరిస్థితి కనిపిస్తోంది.

* నర్సరీల్లో కుప్పలు తెప్పలుగా ఎండిన మొక్కలు

గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నర్సరీలు ప్రస్తుతం నిర్వహణకు నోచుకోక పాడుబడిన పరిస్థితిలో కనిపిస్తున్నాయి. నర్సరీల్లో కుప్పలు తెప్పలుగా ఎండిపోయిన మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు వేల సంఖ్యలో మొక్కలను పెంచేందుకు ఉపయోగించిన నర్సరీల్లో ప్రస్తుతం మొక్కల పెంపకం, సంరక్షణకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతున్న ఆనవాళ్లు కనిపించకపోవడం ప్రశ్నలను రేకెత్తిస్తోంది. ప్రభుత్వ నిధులతో మొక్కలను పెంచి, వాటి సంరక్షణ కోసం ఖర్చు చేసిన తర్వాత నర్సరీల్లోనే మొక్కలు ఎండిపోయి కుప్పలుగా మారితే.. వాటి పెంపకం, నిర్వహణపై బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

లక్షల ప్రజాధనం.. ఫలితం ఏమిటి?

నర్సరీల ఏర్పాటుతో పాటు మొక్కల పెంపకానికి విత్తనాలు లేదా మొక్కల కొనుగోలు, పాలిథిన్ బ్యాగులు, మట్టి, ఎరువులు, నీటి సరఫరా, కూలీల వేతనాలు, నర్సరీల నిర్వహణ, రవాణా తదితర అంశాలపై ప్రభుత్వ నిధులు ఖర్చయ్యే అవకాశం ఉంది. గతంలో ఆయా నర్సరీల కోసం ఎంత మొత్తంలో నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? ఏ పనులకు ఎంత చెల్లించారు? అన్న వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. బిల్లులు, వోచర్లు, మస్టర్ రోల్స్, ఇతర నిర్వహణ రికార్డులను పరిశీలిస్తే నర్సరీలపై ఖర్చయిన ప్రజాధనం ఎంతన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

* రికార్డుల్లో మొక్కలు.. ఇప్పుడు ఎక్కడ?

విలీన సమయంలో వన్ టూ నైన్ ప్రొఫార్మాలో మొక్కల సంఖ్యను నమోదు చేసిన నేపథ్యంలో.. అనంతరం ఆ మొక్కలకు ఏమైందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. మొక్కలను ఇతర ప్రాంతాలకు తరలించి ఉంటే ఎక్కడికి ఎన్ని మొక్కలు పంపారు? ఎవరి ఆధ్వర్యంలో తరలించారు? తరలింపునకు సంబంధించిన రికార్డులు ఉన్నాయా? అన్నది తేలాల్సి ఉంది. ప్రజలకు లేదా ఇతర ప్రభుత్వ సంస్థలకు మొక్కలు పంపిణీ చేసి ఉంటే ఎవరికి ఎన్ని మొక్కలు ఇచ్చారు? స్వీకరించిన వారి వివరాలు నమోదు చేశారా? ఎన్ని మొక్కలు నష్టపోయాయి? ఎండిపోయిన మొక్కలపై ఎలాంటి లెక్కలు నిర్వహించారు? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు రావాల్సి ఉంది. విలీన సమయంలో ఎవరి ఆధీనంలో?

14 గ్రామపంచాయతీలు ఎల్లంపేట మున్సిపాలిటీలో విలీనం అయ్యే సమయంలో నర్సరీల్లో ఉన్న మొక్కలను కూడా ఆస్తులు, సామగ్రి, ఇతర రికార్డులతో పాటు పరిగణనలోకి తీసుకున్నారా? వాటి బాధ్యతను మున్సిపాలిటీకి అప్పగించారా? అప్పగించి ఉంటే ఏ తేదీన, ఏ రికార్డు ఆధారంగా అప్పగించారు? ప్రస్తుతం వాటి నిర్వహణ బాధ్యత ఎవరిది? అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

* ఘనపూర్ లెక్కలు ఎప్పుడు?

ఇప్పటివరకు 13 గ్రామాల నర్సరీలకు సంబంధించిన లెక్కల ప్రకారం 1,33,619 మొక్కలు ఉన్నట్లు తేలింది. అయితే ఎల్లంపేట మున్సిపాలిటీలో విలీనమైన 14వ గ్రామపంచాయతీ ఘనపూర్‌కు సంబంధించిన నర్సరీ మొక్కల లెక్కలు ఇంకా అందాల్సి ఉంది. ఘనపూర్ లెక్కలు కూడా వెలుగులోకి వస్తే 14 గ్రామపంచాయతీల్లో విలీన సమయంలో నమోదైన మొత్తం మొక్కల సంఖ్య ఎంతన్నది స్పష్టంగా తేలనుంది.

1,33,619 మొక్కలు.. మరి ఇప్పుడు ఎక్కడ?

రికార్డుల్లో 1,33,619 మొక్కలు ఉన్నట్లు నమోదు చేస్తే.. వాటిలో ప్రస్తుతం ఎన్ని మొక్కలు ఉన్నాయి? ఎన్ని మొక్కలు బతికున్నాయి? ఎన్ని మొక్కలు పంపిణీ చేశారు? ఎవరికి ఎన్ని ఇచ్చారు? పంపిణీ రికార్డులు ఎక్కడ ఉన్నాయి? ఎన్ని మొక్కలను ఇతర ప్రాంతాలకు తరలించారు? తరలింపునకు ఎవరి అనుమతి ఉంది? ఎన్ని మొక్కలు ఎండిపోయాయి? ఎండిపోవడానికి కారణాలపై నమోదు ఉందా? వేల సంఖ్యలో మొక్కల పెంపకానికి ఎంత ప్రజాధనం ఖర్చు చేశారు? ఆ ఖర్చుకు సంబంధించిన బిల్లులు, వోచర్లు, మస్టర్ రోల్స్ ఎక్కడ ఉన్నాయి? రికార్డుల్లో ఉన్న మొక్కలకు.. క్షేత్రస్థాయిలో కనిపించని మొక్కలకు మధ్య ఉన్న తేడాకు బాధ్యత ఎవరిది?గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన నర్సరీలు నేడు పాడుబడి, మొక్కలు కుప్పలుగా ఎండిపోతుంటే.. ప్రభుత్వ నిధులతో చేపట్టిన నర్సరీల నిర్వహణపై అధికారులు ఎలాంటి లెక్కలు చెబుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వెలవెలపోయాయిన గ్రామ సభ

*** పాలన అధికారులే ప్రజల?**



చిగురుమామిడి/ ప్రజాస్ఫూర్తి : గ్రామ సభ అంటే పంచాయతీ పరిధిలోని ఓటర్ల జాబితాలో పేరున్న ప్రతి ఒక్క గ్రామస్థుడితో కూడిన ప్రత్యక్ష ప్రజాస్వామ్య వేదిక.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(బి) ప్రకారం గ్రామ సభ అనేది పంచాయతీ రాజ్ వ్యవస్థలో అత్యంత ప్రాథమిక మరియు శాశ్వత విభాగం.గ్రామసభలో 10% మంది సభ్యులు లేదా గ్రామసభలోని 50 మంది వ్యక్తులు (ఏది ఎక్కువైతే అది) గ్రామసభను నిర్వహించడానికి. అనుకూలం కానీ చిగురుమామిడి మండలం, ముదిమాణిక్యం గ్రామం లో చట్టలకు విరుద్ధంగా, గ్రామ పాలన అధికారులు వారికి వారే గ్రామసభ నిర్వహించడం చట్టానికి విరుద్ధం.బుధవారం నాటి గ్రామసభ కు జనాల హాజరు అంతంతమాత్రంగానే ఉంది. వచ్చిన కొద్దిపాటి మంది (4గురు) కూడా గ్యారెంటీ హామీలు, స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. మురుగు, డ్రైనేజీలు వంటి సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ, అధికారుల నుంచి ఆశించిన సమాధానాలు రాలేదనే విమర్శలొచ్చాయి. జరిగిన గ్రామసభల్లో అక్కడి ప్రజలు పాత సమస్యలనే చెప్పుకోవాల్సి వచ్చిందని, హాజరైన ప్రజల కంటే పాలన అధికారులే గ్రామ సభలో ఎక్కువ ఉండటం. హాస్యాస్పద ఘటన కనబడుతుంది. ప్రశ్నించిన ఆ నలుగురికి, సమాధానాలు చెప్పడంలో సభ అధ్యక్షతలు కాకుండా, సభలో భాగ్య సభ్యులైన పాలనాధికారాలు సమాధానమించడంతొ,వెలవెలపోయాయిన గ్రామ సభ.

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు

: జీడి సంపత్



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి:మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని వివిధ కమ్యూనిటీ హాళ్లలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా జీడి సంపత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ కొత్త రేషన్ కార్డుల జారీపై తగిన చర్యలు తీసుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించిందని తెలిపారు.మల్కాజిగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు, స్మార్ట్ రేషన్ కార్డులు అందుతున్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్జిత్ గౌడ్, సీనియర్ నాయకులు కొండా గౌడ్, గౌసుదిన్ భాయ్, జీఎన్వి సతీష్, భాస్కర్, రవీందర్, రవి కిరణ్, గణేష్, ఇంతియాజ్, సతీష్ గౌడ్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కిరణ్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : తమ విధినిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగ విరమణ తర్వాత మంచి గుర్తింపునిస్తాయని నల్గొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జడ్పీ సీఈఓ ప్రేమ్ కిరణ్ రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ సూపరిండెంట్ గడుసు సురేందర్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా పరిషత్ లో జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సన్మాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గడుసు సురేందర్ రెడ్డి తన ఉద్యోగ కాలంలో ఎటువంటి మచ్చ లేకుండా ఒక్క మెమో కూడా లేకుండా నిబద్ధతతో నిజాయితీతో ఉన్నతాధికారుల సూచనలు సలహాలతో విధులు నిర్వహించారని అన్నారు. నల్లగొండ జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ సి మోహన్ ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు యాకూబ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సోమేశ్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎడ్ల సైదులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

ప్రతిభ మీది.. పట్టాభిషేకం మాది



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సాహిత్య ప్రభంజనం" కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ కవి, శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మొహమ్మద్ ముస్తఫా స్వీయ రచనలను ఆల్ ఇండియా రేడియో ఎఫ్ఎం కొత్తగూడెం ప్రసారం చేస్తున్న సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.ఆల్ ఇండియా రేడియో కొత్తగూడెం స్టేషన్ డైరెక్టర్ పులిపాక శంకరరావు, కట్ట రామకృష్ణ చేతుల మీదుగా ముస్తఫాను సత్కరించారు. ఈ సందర్భంగా స్టేషన్ డైరెక్టర్ పులిపాక శంకరరావు మాట్లాడుతూ ప్రతిభావంతులైన వ్యక్తుల ప్రతిభను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే ఆల్ ఇండియా రేడియో లక్ష్యమని తెలిపారు.సత్కార గ్రహీత మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ తనకు లభించిన ఈ సత్కారాన్ని తనతో నడుస్తూ, కష్టసుఖాల్లో అండగా నిలిచిన స్నేహితులు, బాల్య మిత్రులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. సత్కారంలో భాగంగా అందించిన కలం తనకు వేలాది సత్కారాలతో సమానమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో మరింతగా భాగస్వామి కావాలని ఈ కలం తనకు పిలుపునిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రేడియో సిబ్బంది పాల్గొన్నారు.

28 ప్యాకేజీ పై ప్రత్యేక దృష్టి సారించండి

*** అధికారులకు సూచించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

ప్రజాస్ఫూర్తి, భైంసా:నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టనున్న 28 ప్యాకేజీ పనులపై అంచనాలు తయారు చేసి తక్షణమే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. ఇటీవల ఎమ్మెల్యే 28 ప్యాకేజీ కి 500 కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరిన విషయం విదితమే.. అందులో భాగంగానే బుధవారం భైంసా లోని ఎమ్మెల్యే నివాసం లో ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా అయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా ప్యాకేజీ పనులు ముందుకు సాగపోవడంతో పనులు ఎంతవరకు చేపట్టారు, ప్రస్తుతం చేపట్టాల్సిన పనులేంటి అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. గతంలో 48 శాతం పనులు అయ్యాయని, ప్రస్తుతం మిగిలిన పనులకు ఎన్ని నిధులు అవసరం అన్న విషయంపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముధోల్, తానూర్, కుభీర్ మండలాలోని ఆయా గ్రామాల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది ప్రభుత్వం. అధికారులు విభాగాల వారీగా అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి తక్షణమే నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ 28 ప్యాకేజీ పనులు పూర్తయితే, గోదావరి నది జలాల ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ తో ముధోల్ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. రామన్న రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. త్వరలోనే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్. ఇ. రాజేంద్రప్రసాద్, ఈఈ ప్రవీణ్, డి. ఇ.నవీన్ తో పాటు అధికారులు పాల్గొన్నారు.

సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి కాదాసు మోహన్ కుటుంబాన్ని పరామర్శ

మాజీ ఎమ్మెల్యే,సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి.



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన కాదాసు మధురవ్వ ఇటీవలికాలంలో అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుమారుడు సిపిఐ ముదిమాణిక్యం గ్రామ శాఖ కార్యదర్శి కాదాసు మోహన్ ను వారి కుటుంబ సభ్యులను సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి లతో కలిసి చాడ వెంకటరెడ్డి పరామర్శించారు.బుధవారం ముదిమాణిక్యంలో మధురవ్వ చిత్రపటానికి వెంకటరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించి,మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.తల్లి మృతితో దుఃఖంలో ఉన్న వారి కుమారుడు మోహన్ తో పాటు కుటుంబ సభ్యులకు వెంకటరెడ్డి ధైర్యం చెప్పారు.కాదాసు మధురవ్వ అకాల మరణం అత్యంత బాధాకరమని,వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని,ఆమె లేని లోటు తీర్చలేనిదని,మధురవ్వ మరణం పట్ల సిపిఐ తరపున తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నట్లు, మోహన్ కుటుంబానికి అన్నివేళాలల సిపిఐ నాయకత్వం అండగా నిలుస్తుందని వెంకటరెడ్డి తెలిపారు.పరామర్శించి,నివాళ్లర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి,తేరాల సత్యనారాయణ,మాజీ సర్పంచ్ లక్కిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,సిపిఐ నాయకులు కయ్యం తిరుపతి,లక్కిరెడ్డి సురేందర్ రెడ్డి,రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు చట్ట సభల నిర్వహణపై అవగాహన కల్గి ఉండాలి



అదనపు కలెక్టర్ అంబదాసు రాజేశ్వర్

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండి చట్టసభల నిర్వహణ, చట్టసభల విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో 31 పీఎం శ్రీ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులతో నమూనా పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మాక్ పార్లమెంట్ లో విద్యార్థులేస్పీకర్గా,కేంద్రమంత్రులుగా, అధికారపక్షం, ప్రతిపక్ష సభ్యులుగా పాత్రలు పోషించారు. విద్యార్థి స్పీకర్ సభా కార్యక్రమాలను నిర్వహించగా.. ఎంపీలుగా వ్యవహరించిన విద్యార్థులు వివిధ ప్రజా సమస్యలను లేవనెత్తుతూ ప్రశ్నలు సంధించారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులుగా ఉన్న విద్యార్థులు సమాధానాలు ఇవ్వడంతో అచ్చం పార్లమెంట్‌ను తలపించేలా సభా కార్యక్రమాలు నడిపించడంతో అక్కడ ఉన్న అందరినీ ఆకట్టుకుంది. సభలో ప్రతిపక్షాలు లేవనెత్తిన పలు సమస్యలకు అధికారపక్షం తరఫున మంత్రులు సమాధానాలు ఇచ్చారు. కొన్ని సమాధానాల పై సంతృప్తి చెందని ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ పోడియం వద్దకు దూసుకెళ్లడం మరింత ఆసక్తికరంగా మారింది. దీంతో మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించిన మాక్ పార్లమెంట్ అచ్చం అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలను తలపించేలా సాగింది.విద్యార్థుల చురుకైన హావభావాలు, వాదనలు, ప్రశ్నలు, సమాధానాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, మాట్లాడే నైపుణ్యం, తార్కిక ఆలోచన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తి పెంపొందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులకు పార్లమెంట్ నిర్వహణ తీరు, స్పీకర్ బాధ్యతలు, అధికారపక్షం-ప్రతిపక్షాల పాత్ర, ప్రశ్నోత్తరాల సమయం, ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం వంటి అంశాలపై ప్రత్యక్ష అవగాహన కలిగిందని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం పాల్గొన్న విద్యార్థులను ధృవపత్రాలు అందజేసి ప్రశంసించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, లు ఏ ఏం ఓ,సుదర్శనమూర్తి, సోషల్ ఫోరం సభ్యులు నర్సింలు, దేవి సింగ్ ప్రభాకర్, భూళి భాయ్, సంగీత,ప్రసాద్ రెడ్డి, చల్లా లక్ష్మణ్, లింగమయ్య మరియు న్యాయ నిర్ణేతలుగా గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ శ్రీనివాస్. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి ఘనంగా వీడ్కోలు



ప్రజాస్ఫూర్తి, భైంసా:నిర్మల్ జిల్లా ముధోల్ మండలం విట్టోలి తాండ ఎంపీపీ ఎస్ పాఠశాలలో 38 ఏళ్ల పాటు సుదీర్ఘంగా విధులు నిర్వహించినేడు పదవి విరమణ పొందిన గడపాలేలక్ష్మణ్ సింధుతాయి దంపతులకు, బామ్ సేఫ్ నాయకులు పదవి విరమణ సందర్భంగా ఘనంగా శాలువాతో సత్కరించి,అనంతరం మెమొంటోను అందజేసి వారు పాఠశాలలో విద్యార్థులకు అందించినటువంటి సేవలు గురించి కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గడపాలే మైసజీ, భామ్ సేఫ్ నాయకులు, కపిల్ వాగ్మారే, అనిల్ కుమార్ మౌర్య, ముస్లిం మోర్చా నాయకులు, షేక్ ఇస్మాయిల్, అజీజ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శంకర్, బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సుంకేటపోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్నగర్ నియోజకవర్గ ప్రజా సేవకు మరో గౌరవం

*** ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు కు గౌరవ డాక్టరేట్ అవార్డు**

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: హుజూర్నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు చేసిన సేవలను గుర్తించి యూనివర్సల్టనరి అవార్డుకౌన్సిల్ ఆధ్వర్యంలో ఢిల్లీలోఆయనకు గౌరవ డాక్టరేట్ అవార్డు ను అందజేశారు. ముందుగా నా సొంత గ్రామానికి సేవ చేయాలి... నా గ్రామం అభివృద్ధి చెందాలి" అనే సంకల్పంతో తన స్వగ్రామంలో దాదాపు ₹30 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.అక్కడితో ఆగకుండా గత ఆరు సంవత్సరాలుగా హుజూర్నగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ, నిరుపేదలు, విద్యార్థులు, రైతులు, యువత, ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తూ "నేనున్నాను" అనే భరోసాను కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

ప్రజాస్ఫూర్తి, భైంసా:నిర్మల్ జిల్లా ముధోల్ మండలం విట్టోలి తాండ ఎంపీపీ ఎస్ పాఠశాలలో 38 ఏళ్ల పాటు సుదీర్ఘంగా విధులు నిర్వహించినేడు పదవి విరమణ పొందిన గడపాలేలక్ష్మణ్ సింధుతాయి దంపతులకు, బామ్ సేఫ్ నాయకులు పదవి విరమణ సందర్భంగా ఘనంగా శాలువాతో సత్కరించి,అనంతరం మెమొంటోను అందజేసి వారు పాఠశాలలో విద్యార్థులకు అందించినటువంటి సేవలు గురించి కొనియాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గడపాలే మైసజీ, భామ్ సేఫ్ నాయకులు, కపిల్ వాగ్మారే, అనిల్ కుమార్ మౌర్య, ముస్లిం మోర్చా నాయకులు, షేక్ ఇస్మాయిల్, అజీజ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శంకర్, బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సుంకేటపోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగానికి రమాదేవి సేవలు ఆదర్శనీయం

*** ఉద్యోగ విరమణ సమావేశంలో కూసుమంచి ఎంఈవో వీరస్వామి**




కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం కావడానికి విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో అంకితభావంతో పనిచేసి నేటితో ఉద్యోగ విరమణ చేయుచున్న యద్దనపూడి లక్ష్మీ రమాదేవి సేవలు ఈనాటి ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శనీయం అని మండల విద్యాశాఖ అధికారి రాయల వీరస్వామి కొనియాడారు. బుధవారం ఉద్యోగ విరమణ చేయుచున్న వైఎల్ రమాదేవికి ఎంపీపీఎస్ నాయకన్ గూడెం నందు వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాలలో ఉద్యోగ విరమణ కార్యక్రమం వేడుకగా జరిగింది. విద్యార్థులు కోలాటంతో రమాదేవి, సీతారాం సార్ దంపతులఘనంగా అహ్వానించారు. ఈ సందర్భంగా దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచరి సైదమ్మ, ఉప సర్పంచ్ భీష్మాచారి, మాజీ ఎంపీటీసీ జహంగీర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గొళ్ళపూడి వీరన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం రవీందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు నర్సయ్య, నాగేందర్, భారతి, సరిత, రజిత తదితరులు పాల్గొన్నారు.

184 బలరాం నగర్ డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం 184 బలరాం నగర్ డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించబడింది. డివిజన్‌లోని అంబేద్కర్ భవన్, భగత్‌సింగ్ నగర్ కమ్యూనిటీ హాల్, ఎల్‌బీ నగర్ కమ్యూనిటీ హాల్‌లలో అర్హులైన రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు, 184 బలరాం నగర్ డివిజన్ అధ్యక్షుడు మోర శ్రీకాంత్ ముదిరాజ్, మేడ్చల్ జిల్లా అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి సంధ్యతో కలిసి ఓల్డ్ నేరేడ్‌మెట్ ప్రాంతంలో పర్యటించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్‌సింగ్, సానాది శంకర్, పార్థసారథి, పెరక శ్రీశైలం ముదిరాజ్, లక్ష్మీపతి, హ్యారీ డిమాంటీ, ఆకుల శ్రీనివాస్ యాదవ్, మాల్యాద్రి, శోభన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో కిసాన్ సమ్మేళనంలో పాల్గొన్న దేగాం సర్పంచ్



ప్రజా స్ఫూర్తి, బైంసా:అఖిల భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఇండోర్ స్టేడియంలో చేపట్టిన మహిళ రైతు సమ్మేళనంలో బుధవారం దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి పాల్గొన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆహ్వానం మేరకు ఆమె ఢిల్లీ వెళ్లారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి మహిళ రైతు ప్రతినిధులు ఈ సమ్మేళనానికి వెళ్లడం జరిగిందని ఈ సందర్భంగా సర్పంచ్ సిరం సుష్మారెడ్డి తెలియజేశారు. ప్రస్తుతం రైతాంగం అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు ఈ సమావేశంలో వివరించడం జరిగిందన్నారు. దేశానికి రైతే వెన్నుముఖ అని రైతు బాగుండాలన్నదే భారతీయ కిసాన్ సంఘ్ ఉద్దేశం అన్నారు. సమ్మేళనానికి హాజరు కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఆమె వెంట తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు మహిళా ప్రతినిధులు వెళ్లారు.

కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో సేవా సంకల్ప్ అభియాన్ చిత్రలేఖనం, ఉపన్యాసం పోటీలు



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: భారత ప్రధాని నరేంద్ర మోదీ అంకితభావంతో కూడిన 25 సంపత్సరాల ప్రజా సేవకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రజల భాగస్వామ్యంతో సమిష్టిగా నిర్వహింపబడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం బాచుపల్లి లోని కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు ఉపన్యాసం ,చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'నేను కలలుగన్న అభివృద్ధి చెందిన భారతదేశం' ఇతివృత్తంగా, '25 సంవత్సరాల సేవ , సమర్పణ', 'అభివృద్ధి చెందిన భారతదేశం' అన్న భావనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొని అద్భుతమైన చిత్రాలు గీశారు. తాము కలలుగన్న భారతదేశం గురించి ఉపన్యసించారు. బాచుపల్లి భాజపా అధ్యక్షురాలు, మాజీ కార్పోరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కోకన్వీనర్ డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలు సాయి వేదశ్రీ, చిన్మయి, శ్లోక, శనయ, ఆరాధన, అభిషేక్ లకు బహుమతి ప్రదానంతో పాటు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మేడ్చల్ (అర్బన్) జిల్లా భాజపా ,సేవా సంకల్ప్ అభియాన్ తరపున ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్స్) అందించారు. ఈకార్యక్రమంలోప్రిన్సిపాల్ కవిత, బీజేపీ నాయకుడు పద్మ ప్రసాద్, పాయల్, భువన, సంధ్య, కోటేశ్వరి, దృశ్యంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, జిల్లా సమగ్ర అభివృద్ధిపై కలెక్టర్ కె. హరిత ప్రత్యేక దృష్టి

*** ప్రజా సంక్షేమం, జిల్లా సమగ్ర అభివృద్ధిపై కలెక్టర్ కె. హరిత ప్రత్యేక దృష్టి**

*** ప్రమాదాల నివారణకు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి**

*** ఉన్నతాధికారులతో కలెక్టరేట్‌లో వరుస సమీక్షా సమావేశాలు**



ఆసిఫాబాద్, ప్రజాస్ఫూర్తి :కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణ, నాణ్యమైన ఆహార సరఫరా , బాధితులకు సత్వర చట్టపరమైన న్యాయం అందించడమే లక్ష్యంగా జిల్లా యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కె. హరిత వివిధ శాఖల అధికారులతో వరుస సమీక్షా సమావేశాలు నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు.

*** రహదారి భద్రత - ప్రమాదాల నివారణ:**

ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి నిర్వహించిన రహదారి భద్రత సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే 'బ్లాక్ స్పాట్స్'లను గుర్తించి తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పశువులు, కుక్కలు రహదారులపైకి రాకుండా యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే ఆటో, ఇతర డ్రైవర్లపై 'డ్రంక్ అండ్ డ్రైవ్' కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తనిఖీలతో పాటు మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ప్రమాద క్షతగాత్రులను వేగంగా ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

*** అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం:**

అనంతరం డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు 39 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ప్రతి కేసును క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించి బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన బాధితులకు ప్రభుత్వ పరిహారం అందించేందుకు తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు.

*** కల్తీ ఆహారంపై కఠిన చర్యలు:**

ఆహార భద్రతా సలహా కమిటీ సమీక్షలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి పాల్గొన్న కలెక్టర్, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీరాయుళ్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. హోటళ్లు, బేకరీలు, తినుబండారాల దుకాణాలతో పాటు గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఫుడ్ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపార సంస్థలలైసెన్సులను పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని, తనిఖీల్లో గుర్తించిన కల్తీ వివరాలను, సదరు వ్యాపారుల పేర్లను ప్రజలకు తెలిసేలా పత్రికల్లో ప్రచురించాలని ఆదేశించారు.

హాజరైన అధికారులు:

ఈ సమావేశాలలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డిఎస్పీలు అశోక్, వహిదుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, విద్యాశాఖాధికారి సచ్చిదానందచారి, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారి వాసురావు, ఫుడ్ ఇన్స్పెక్టర్ మహేందర్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఈఈ ధర్మేందర్, ఎస్సీ సంక్షేమాధికారి అశోక్, విజిలెన్స్ కమిటీ సభ్యులు సిడాం అర్జు, గోపాల్, కేశవరావు, గణేష్, గంగుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

*** నల్లగొండ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులుగా కర్నాటి రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నిక.**



ప్రజాస్ఫూర్తి ,నల్లగొండ:సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నల్లగొండ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కర్నాటిరాజేష్ ను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్ ,రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్. చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుకోరిన సమాచారాన్ని 30రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు.సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతి నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు.నల్లగొండ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు గా ఎన్నికైన కర్నాటి రాజేష్ మాట్లాడుతూ సమాచారహక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17అంశాలసమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు.మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేసమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250నుండి గరిష్టంగా 25వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారు అని అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ, సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం, పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. నా యొక్క నియామకానికి సహకారం అందించిన జిల్లా అధ్యక్షులు సిద్ధం వెంకన్నకి రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టి పట్టబద్రుల ఎమ్మెల్సి అభ్యర్థి గా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టబదుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేయడం పట్ల సూర్యాపేట నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు కూడా సర్వోత్తమ్ రెడ్డి ఎన్నికల ప్రచార బాధ్యతను తీసుకున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలలో తిరుగులేని నాయకుడిగా ఎదిగిన దామోదర్ రెడ్డి (దామన్న) వారసుడిగా ఆయన ప్రజలలో ఆదరణ కలిగివున్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని , పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి తనకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహంపై సర్వోత్తమ్ రెడ్డికి దిశానిర్దేశం చేశారు. మొదటిసారి ఎన్నికలలో పోటీ చేస్తున్న సర్వోత్తమ్ రెడ్డి విజయం సాధించాలని సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

చేనేత కళ, స్థానిక సంస్కృతి, ప్రకృతి అందాలను పర్యాటకులకు పరిచయం చేయాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి:బుధవారం పోచంపల్లి పట్టణంలోని టూరిజం పార్క్ ను జిల్లా కలెక్టర్ సందర్శించి, 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన టూరిజం గైడ్స్, చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోచంపల్లి పర్యాటక అభివృద్ధికి 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమాన్ని రూపొందించి, దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని, పర్యాటకులకు అందించాల్సిన అనుభవాలపై చర్చించారు. పర్యాటకులకు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ విధానం, చేనేత కార్మికుల నైపుణ్యం, స్థానిక ఆహారపు ప్రత్యేకతలు, స్థానిక సంస్కృతి, జీవన విధానంతో పాటు పోచంపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను ప్రత్యక్షంగా పరిచయం చేసేలా కార్యక్రమాలను రూపొందించాలని కలెక్టర్ సూచించారు.'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, చేనేత కార్మికులు తయారు చేసే ఇక్కత్ వస్త్రాలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తద్వారా పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో మరింత గుర్తింపు లభించే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికుల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాల్లో కంటి సమస్యలు గుర్తించిన వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత & జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారత లవకుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు, చేనేత & జౌళి శాఖ సిబ్బంది, టూరిజం గైడ్స్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు



పాలకుర్తి/జనగామ, ప్రజాస్ఫూర్తి : భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు హిందూ దేవతలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం జిల్లా లోని పాలకుర్తి మండల కేం ద్రంలో బీజేపీ శ్రేణులు ఆందోళన చేప ట్టాయి. బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చే సేందుకు కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.ఈ సందర్భం గా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాజకీయ విమర్శల పేరుతో శ్రీరాముడు , శివుడు వంటి ఆరాధ్య దైవాలను రాజ కీయాల్లోకి తీసుకురావడం ద్వారా హిం దువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు.సీ ఎం స్థాయిలో ఉన్న వ్యక్తి బాధ్యతాయు తంగా మాట్లాడాలని, తాము అభ్యంత రం వ్యక్తం చేస్తున్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.లే నిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర,జిల్లా నేతలు పగనాటి దామోదర్ రెడ్డి, సుంకరనేని కోటేశ్వర్, మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, పబ్బ సంతోష్, పెను గొండ సోమేశ్వర్,కడుదుల నిరంజన్, దే వరాజ్, సురేష్ యాదవ్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

*** తహసిల్దారులను ఆదేశించినజిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: బుధవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి రీ సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను మండలాల వారీగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని , ఎన్ని మండలాల్లో కొత్తగా రీ సర్వే పనులు ప్రారంభమయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ఇంకా రీ సర్వే ప్రక్రియలో జాప్యం జరుగుతున్న మండలాలు ఏవి, జాప్యానికి గల కారణాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం ఎన్ని నోటీసులు జారీ చేశారు, మండలాల వారీగా ఎన్ని నోటీసులు అందజేశారు, వాటిలో ఎంతమేరకు ప్రక్రియ పూర్తయిందని , నోటీసులుఅందుకున్నప్పటికీస్పందించని వారు ఎంతమంది ఉన్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన వివరాలు, స్పందనలు సకాలంలో స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ సర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా,సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం లో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, రెవిన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి మండలా ల తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2న దుకాణాలు మూసివేయాలి

*** ఉల్లంఘిస్తే కఠిన చర్యలు మున్సిపల్ కమిషనర్**

జనగామ,ప్రజాస్ఫూర్తి : జాతిపిత మహా త్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టో బర్ 2న జనగామ పురపాలక సంఘం పరిధిలో మాంసం, చికెన్ విక్రయాలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు మున్సిపల్ క మిషనర్ తెలిపారు. గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని పురస్కరించుకుని అక్టోబ ర్ 2న పట్టణంలో జీవహింసకు తావులే కుండా మాంసం, చికెన్ దుకాణాలను మూసివేయాలని వ్యాపారులను ఆదే శించారు. నిబంధనలు ఉల్లంఘించి విక్ర యాలు చేపడితే ట్రేడ్ లైసెన్స్ రద్దు చే యడంతో పాటు భారీ జరిమానా విధిం చి, చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ను తొలగించాలి

*** సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్**

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఈసి) జ్ఞానేశ్వర్ కుమార్ ను ఆ బాధ్యత నుండి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో శీలం గురుమూర్తి అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బిజెపి కనుసైగల్లో దేశ ఎన్నికల



కమిషనర్ పనిచేస్తున్నారని, మోడీ. అమీత్ షా ఏజెంట్గా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వ్యవహరిస్తున్నారని, దేశ ప్రజలను ఓటర్ల జాబితాలో చేర్పించాల్సిన ఎన్నికల కమిషనర్ అందుకు విరుద్ధంగా ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియకు పాల్పడ్డాడని ఆయన విమర్శించారు. ఎన్నికల జాబితాను సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్ ఫక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. అనంతరం పద్మా రెడ్డి భవనం నుండి మండల సెంటర్ వరకు కేంద్రం వరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్లో ప్రధాని ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ జిట్టి బొమ్మను దహనం చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మాతరావు, డివిజన్ కమిటీ సభ్యులు,యడవల్లి రమణారెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కర్ణ బాబు, గన్య నాయక్, మండల కమిటీ సభ్యులు చీర్ల రాధాకృష్ణ, వెంకటయ్య, జవాజి శీను, చిత్తూరు వెంకన్న ,ఎస్ కే బాబు, పడిశాల శేషయ్య వివిధ గ్రామాలకు చెందిన శాఖ కార్యదర్శి, ముఖ్య నాయకులు, పాల్గొన్నారు

ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసిన మైనార్టీ సెల్ నేతలు



పాలకుర్తి/జనగామ, ప్రజాస్ఫూర్తి : పాల కుర్తి నియోజకవర్గంలోని మైనార్టీ సెల్ మండల అధ్యక్షుల నియామకాల పై కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపా ధ్యక్షురాలు రూన్సీ రెడ్డితో చర్చించారు.బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాజీద్ అప్సర్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి ని యోజకవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాలకు మైనార్టీ అ ధ్యక్షుల నియామకాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు పోగు శ్రీనివాస్, జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యులు ఎం.డి. మదార్, జిల్లా అధికార ప్రతినిధి నరేంద్ర పవర్, జనగా మ పట్టణ కార్యదర్శి ఖాదర్ షరీఫ్, మై నార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎం.డి. సలీం,యూత్ కాంగ్రెస్ జనగామ నియో జకవర్గ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ టీసీ ఎం.డి. రహీం, మొహసిన్ తదిత రులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామ శాఖ భరోసా



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త సుదనబోయిన వెంకన్న మాతృమూర్తి వెంకటమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం ఆమె కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు పరామర్శించారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ,బాధిత కుటుంబానికి అండగా రూ.11,500 నగదు,25 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్యకర్తల కష్టాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బేతోలు గ్రామ శాఖ నాయకులు షేక్ ఖాదర్ బాబా, గద్దపాటి సంతోష్, అనపర్తి మదన్, సిరికొండ కృష్ణ, ఏర్పుల హుస్సేన్, గద్దపాటి వేణు, జిన్నుక ఎల్లయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగిని ఆత్మహత్య

*** తొర్రూరులో విషాద ఘటన.. కారణాలపై పోలీసుల దర్యాప్తు**



కొడకండ్ల/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కొడకండ్ల మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కొడకండ్ల పోస్టాఫీసు లో పోస్టల్ ఉద్యోగినిగా పనిచేస్తున్న అంకిత ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. తొర్రూరు పట్టణంలో నివా సం ఉంటున్న అంకిత మంగళవారం బ స్టాండ్ ఎదురుగా ఉన్న తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. ఘటనకు గల కార ణాలు ఇంకా తెలియరాలేదు. సమాచా రం అందుకున్న పోలీసులు ఘటన పై దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. కుటుం బ సభ్యులు,పోలీసుల వివరాలు వెల్లడై న తర్వాత పూర్తి సమాచారం వెలువడే అవకాశం ఉంది.

మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు

*** సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బచ్చలకూరి కృష్ణప్రసాద్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ.**



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : హుజుర్ నగర్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో, గరిడేపల్లి మండలంలోని కల్మలచేరువు గ్రామానికి చెందిన అమరవరపు మేరమ్మ భర్త లింగయ్య కి రూ.32,500 లను,ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బచ్చలకూరి కృష్ణ ప్రసాద్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా కృషిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పున్నా నాగరాజు,కల్మలచేరువు గ్రామ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అమరవరపు గిరి,గ్రామ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు అమరవరపు శ్రీను లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ల కుటుంబాలను పరామర్శించిన మున్సిపల్ చైర్పర్సన్

జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని 30వ వార్డులో కాంగ్రెస్ పార్టీ మాజీ కౌ న్సిలర్లు గొర్రె కిష్టయ్య, నమిలె ఎల్లయ్య కుటుంబాలను జనగామ మున్సిపల్ చై ర్పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పరామర్శించారు.కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించా రు.పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుం దని భరోసా ఇస్తూ,తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ ఆరుట్ల లోకమంత్ రెడ్డి, కాంగ్రెస్ జనగామ పట్టణ అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్, స్థానిక వార్డు నాయకు లు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆందోళన కార్యక్రమం జయప్రదం చేయాలి

*** టియుడబ్ల్యుజె మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు**



(ప్రజాస్ఫూర్తి,మేడ్చల్ జిల్లా) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న నిర్వహించే తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు కే బి హెచ్ బి కాలనీ మెయిన్ రోడ్ లోని గాంధ్రీ విగ్రహం వద్ద శాంతియుత ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా పాలన మొదలై మూడేళ్లు గడుస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడం ఆందోళనకరమన్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో జర్నలి స్టుల ఆరోగ్య భద్రత కోసం చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకర మని పేర్కొన్నారు. గతంలో ఉన్న హెల్త్ స్కీం లను పునరుద్ధరించాలని టీయూడబ్ల్యూజే మొదటి నుంచి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన చెందారు. ఉద్యోగులతో సమా నంగా ఆరోగ్య భద్రత కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనకే పరిమితమైనయని తెలిపారు. జర్నలిస్టు కుటుంబాల ఆరోగ్య భద్రత కోసం జర్నలిస్టులు ఆందోళన బాట పట్టక తప్పని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. అదేవిధంగా ఇల్లు, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు. వేతన బోర్డు, జర్నలిస్టుల రక్షణ చట్టాలను ఏర్పాటు చేయాలన్న తదితర డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్, కూకట్ పల్లి నియోజకవర్గలకు చెందిన జర్నలిస్టులు ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు శిక్షణ

*** కేవీకే–గడ్డిపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమం**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), హుజూర్‌నగర్ డివిజన్ ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ కార్యక్రమంలో భాగంగా కేవీకే-గడ్డిపల్లిలో పాలకీడు మండలంలోని వివిధ గ్రామాల్లోనీ రైతులకు వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త సి.హెచ్. నరేష్ మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లాలో వరి సాగు విస్తీర్ణం అధికంగా ఉందని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు, నూనెగింజ పంటలు, కూరగాయలు, పండ్ల తోటలను సాగు చేయడం ద్వారా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవచ్చని వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డి. ఆదర్శ్ మాట్లాడుతూ పంటల సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు, సమగ్ర వ్యవసాయ విధానాల ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎడిఏ, హుజూర్‌నగర్ ఆర్. రవి, కేవీకే శాస్త్రవేత్తలు సి.హెచ్. నరేష్, డి. ఆదర్శ్, డాక్టర్ పి. అక్షిత్ సాయి, ఏఈవోలు ఎం. గోపి, రియాజ్ తదితరులతో పాటు సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే సమసమాజ స్థాపన సాధ్యం

*** విద్యాశాఖ అధికారుల చొరవ, దాతల ఉదారత అభినందనీయం: ఎమ్మెల్యే**

ప్రజాస్ఫూర్తి,షాద్‌నగర్:మూఢన మ్మకాలు, సామాజిక విచక్షతలను అధిగమించి విద్య ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. విద్యాశాఖ అధికారుల చొరవ, దాతల ఉదారతతో షాద్ నగర్ పట్టణంలో హజీపల్లి శివారులో ఉన్నసిండికేట్ కాలనీ లో పేద విద్యార్థుల చదువుకు నిర్మించతలపెట్టిన పాఠశాల భవన నిర్మాణం పనులను బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఎంఈఓ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక విలేకరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాచీన కాలం నుండి నెలకొన్న అసమానతల వల్ల ఎన్నోకులాలు, పేద వర్గాలు విద్యకు దూరమయ్యాయన్నారు. బడికి దూరమైన ప్రతి పేద విద్యార్థిని గుర్తించి నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా విద్యాశాఖ కృషి చేస్తోందని కొనియాడారు.

*** దాతల ఉదారత.. ప్రజాప్రతినిధు సహకారం**

"పుట్టుకతో ఎవరూ గొప్పవారు కాదు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు ప్రజాప్రతినిధులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే దాదాపు 50 మంది దాతలు ₹5000 మొదలుకొని 5లక్షల వరకు తమవంతు ఆర్థిక సాయాన్ని అందించారాని, మరింత మంది దాతలు విరాళాలు అందించడానికి సిద్ధమయ్యారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, భోజన వసతులతో పాటు, పాఠశాలల వసతులను మెరుగుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. కేవలం పిల్లల చదువుకే పరిమితం కాకుండా,వారి తల్లిదండ్రులు స్వయంశక్తితో బతికేందుకు వీలుగా వృత్తిపరమైన సహాయసహకారాలు కూడా అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకటించారు. సామాజిక బాధ్యతతో పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందుకు వచ్చిన విలేకరులు, విద్యాశాఖ అధికారులు, సర్పంచ్, నాయకులు,దాతలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సువర్ణావకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: డిఆర్ డిఓ మచ్చ గీత



చిగురుమామిడి/ప్రజాస్ఫూర్తి: మహిళల ఆర్థిక అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, సంఘాల్లో లేని మహిళలు అందరినీ చేర్పించాలని డిఆర్ డిఓ మచ్చ గీత పిలుపునిచ్చారు. బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని ఉదయలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం వీఓ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ముక్కుల్ఫ్ ఎంసిఎల్ఎఫ్,లోకోస్ యాప్, ఎస్ హెచ్ జి,వివో,ఎమ్ ఎస్ ,గ్రేడింగ్‌లపై నిర్వహించిన ఈ శిక్షణ తరగతులకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మచ్చ గీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఆర్‌డీఓ గీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్క మహిళను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సంఘంలో ఉన్న ప్రతి సభ్యురాలు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు.అలాగే, వీఓలకు సొంత భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, సంఘాల ద్వారా తీసుకున్న అప్పుల రికవరీ 100శాతం ఉండాలని అధికారులకు, ప్రతినిధులకు సూచించారు.మహిళలు కేవలం సంఘాలకే పరిమితం కాకుండా, సొంతంగా కుటీర, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి మహిళా సభ్యురాలికి ఇంట్లోనే 2నుంచి 3రకాల ఆదాయాలు వచ్చేలా వినూత్న ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఇదే సమయంలో పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్క మహిళ తమ ఇళ్ల వద్ద ఇంకుడుగుంతలు, పొలాల్లో ఫార్మ్ పాండ్స్ నిర్మించుకునేలా అవగాహనకల్పించాలని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఎం కరుణాకర్,ఏపీఎం రజిత,మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభారాణి,సీసీలు సత్యనారాయణ, రవీందర్, రమేష్,రంజిత్ పాల్గొన్నారు.వీరితో పాటు అన్ని గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, మండల సమాఖ్య సిబ్బంది శైలజ, శివకృష్ణ,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు పీసీఆర్ ఫౌండేషన్ రూ.5,000 ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:జన్నారం, పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన మంతెన రవీందర్ (ఎంఎస్) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన కుటుంబం చాలా పేదవారు. ఈ పరిస్థితిని తెలుసుకున్న పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ స్పందించి, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా ముడుగు ప్రవీణ్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే పీసీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నోముల రాజ్ కుమార్, కొత్త శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బాలల భద్రత పై ప్రత్యేక అవగాహన

*** ఆరోగ్యం, హక్కులు, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన..**

జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థుల ఆరోగ్యం,భద్రత, బా లల హక్కులపై అవగాహన కల్పించేం దుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠ శాలకు 15 అవగాహన పోస్టర్లు, మూ డు రకాల బ్యానర్లను అందజేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించా రు. మాసిక ఆరోగ్యం-పరిశుభ్రత, పాఠ శాల భద్రత, బాలల హక్కులు-శరీర భద్రత, పోక్సో చట్టం తదితర అంశాల పై పోస్టర్ల ద్వారా విద్యార్థులకు అవగా హన కల్పిస్తున్నట్లు తెలిపారు. రుతుక్ర మంపై అపోహలు తొలగించి పరిశుభ్రత పాటించడం, ఆరోగ్య సమస్యలు ఎదు రైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లే దా ఆరోగ్య సిబ్బంది సహాయం పొంద డం వంటి అంశాలను వివరించినట్లు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు,పిడుగు లు, వరదలు, భూకంపాలు, విద్యుత్, ల్యాబ్ ప్రమాదాలు, రోడ్డు ప్రయాణాలు, ఆన్‌లైన్ భద్రత తదితర అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల ను కూడా పోస్టర్లలో పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. అత్యవసర సమ యంలో 112, 101, 108, 1098 నం బర్లను వినియోగించుకోవాలని సూచిం చారు.'నా శరీరం నా హక్కు నా భద్ర త' అనే సందేశంతో మంచి స్పర్శ చెడు స్పర్శ,వ్యక్తిగత హద్దులు,బాలల హక్కు లు,పోక్సో చట్టంపై విద్యార్థులకు అవ గాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అసు రక్షిత పరిస్థితులు, బెదిరింపులు, ఆన్ లైన్ వేధింపులు ఎదురైతే నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు.పాఠశాలలు విద్యార్థులకు సురక్షిత మైన వాతావరణాన్ని కల్పిస్తూ, వారి ఆరోగ్యం, భద్రత, హక్కులపై నిరంతరం అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదే శించారు.

కలమడుగు ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



ప్రజాస్ఫూర్తి , జన్నారం: జన్నారం మండలంలోని కలమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ బుధవారం ఆర్ బి ఎస్ కే (రాష్ట్రీయ బాల స్వచ్ఛ కార్యక్రమం) ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు మరియు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.బి.ఎస్.కె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌరీ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అవసరమైన మందులను, కంటి అద్దాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. సుమారు 156 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి మాట్లాడుతూ ఆర్ బి ఎస్ వారు పాఠశాలకు వచ్చి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి అవసరమైన మందులు,కంటి అద్దాలు ఇవ్వడం విద్యార్థులకు మంచి అవకాశం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కే సిబ్బంది శైలజ, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం లేని సమాజమే రోటరీ క్లబ్ లక్ష్యం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లీబిడ్డలకు పౌష్టికాహార మందులు,పౌడర్ డబ్బాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు.క్లబ్ అధ్యక్షులు దూదికట్ల సత్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శంతన్ రామరాజు,డిస్ట్రిక్ట్ లీడర్ వద్దుల సురేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా దూదికట్ల సత్యం మాట్లాడుతూ,రోటరీ ఇంటర్నేషనల్ సూచనల ప్రకారం తల్లీ,నవజాత శిశువుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. సమాజంలో ఎంతోమంది నిరుపేద మహిళలు సరైన పోషకాహారం లేకపోవడంతో రోగాల బారిన పడుతున్నారని అన్నారు.నవజాత శిశువులు సైతం తమ ఎదుగుదలకు కావాల్సిన బలవర్ధకమైన ఆహారం అందక శారీరక అవలక్షణాలకు లోనవడం, మృత్యువాత పడటం జరుగుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ స్థాయిలో పీజీ మెడికల్ ర్యాంకు సాధించిన మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఈగ శ్రీనివాస్, రమ్యల కుమార్తె కిరణ్మయిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ముల్లంగి మోహన్ రెడ్డి,పాస్ట్ ప్రెసిడెంట్ వేమిశెట్టి కిషోర్ కుమార్,డిస్ట్రిక్ట్ లీడర్ బిక్కి వెంకటేశ్వర్లు,సాధు మహిపాల్ రెడ్డి,వల్లాల రమేష్,బోయినిపల్లి సతీష్ రావు,అచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిశుభ్రత లక్ష్యంగా ముందడుగు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ పట్టణ పరిశుభ్రతకు మరింత మెరుగులు దిద్దేందుకు మున్సిపాలిటీ నూతనంగా గ్రాస్ కటింగ్ మిషన్లను అందుబాటులోకి తెచ్చింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్,కమిషనర్ ఎం.వినోద్ కుమార్ కలిసి ఈ మిషన్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ, పట్టణంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు.రోడ్లు, ప్రధాన కూడళ్లు, పచ్చిక ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుశావలి, వెహికల్ ఇంచార్జ్ సత్యనారాయణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శ్రీహరి,కరుణాకర్,జవాన్లు శ్రీను,కృష్ణ,చిరంజీవి,శ్రీను, మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలిసిన సభ్యులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.ఉపేంద్రను ఆమె ఛాంబర్ లో జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు గొల్లపల్లి రజనీకాంత్,ఎస్సీ సెల్ జిల్లా నాయకులు పాడిశాల వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జిల్లాలో ఎస్సీ,ఎస్టీల సంక్షేమ పథకాలు,ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందుతున్న రుణ సౌకర్యాలు,స్వయం ఉపాధి పథకాల అమలు తీరుపై చర్చించడం జరిగింది.జిల్లాలో అర్హులైన దళిత నిరుద్యోగ యువతకు పథకాలు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఈడీని కోరడం జరిగిందని గొల్లపల్లి రజనీకాంత్ తెలిపారు.దీనికి సానుకూలంగా స్పందించిన ఈడీ ఉపేంద్ర,ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సిరిసిల్ల సీఎం రేవంత్ రెడ్డి సభకు కదిలిన చిగురుమామిడి కాంగ్రెస్ శ్రేణులు



చిగురుమామిడి/ ప్రజాస్ఫూర్తి:రాజన్న సిరిసిల్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు చిగురుమామిడి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.బుధవారం చిగురుమామిడి మండల కేంద్రం నుండి ప్రత్యేక బస్సుల్లో వారు సభకు స్వచ్ఛందంగా తరలిపోయారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేసేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పిలుపు మేరకు మండల ప్రజలు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున కదిలివచ్చారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,డిసిసి జిల్లా కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్, పార్టీ ప్రతినిధి పొన్నం శ్రీనివాస్,గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తోపాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,ముఖ్య నాయకులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభంలో జాప్యం

* కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ ఎమ్మెల్యేల చేతగానితనానికి నిదర్శనం
* ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్

ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మించిన క్రిటికల్ కేర్ సెంటర్ నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక బీజేపీ ఎమ్మెల్యేల తీవ్ర నిర్లక్ష్యం మరియు చేతగానితనానికి ప్రత్యక్ష నిదర్శనమని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇరు పార్టీల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయ లబ్ధి కోసం ప్రజారోగ్యంతో చెలగాటంకోట్ల రూపాయలతో వెచ్చించి



నిర్మించిన భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ, క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించకుండా కాలయాపన చేయడం వెనుక స్వార్థ రాజకీయం దాగి ఉందని సయ్యద్ హైదర్ మండిపడ్డారు. అత్యవసర వైద్య సేవలందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

*** బాధ్యతల నుంచి తప్పుకునేందుకు పరస్పర ఆరోపణలు**

ప్రజా వైద్యం కంటే తమ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నట్లుగా ఇరు పార్టీలు వ్యవహరిస్తున్నాయని, తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు.తక్షణమే ప్రారంభించాలి:అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి నెపాలు చెప్పకుండా, రాజకీయం పక్కనపెట్టి క్రిటికల్ కేర్ సెంటర్‌ను తక్షణమే ప్రారంభించి నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సమస్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

గిరిజన చరిత్రలో సువర్ణాక్షరాలు కేసీఆర్ నిర్ణయాలు

* మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, భవిష్యత్తు కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు గిరిజన చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.మహబూబాబాద్, రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2022 సెప్టెంబర్ 30న రాష్ట్రంలో గిరిజనుల రిజర్వేషన్‌ను 6శాతం నుంచి 10శాతానికి పెంచుతూ కేసీఆర్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని,ఆ నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గిరిజనుల కోసం చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో గిరిజన విద్యార్థులు,



ఉద్యోగార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు.గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి ప్రత్యేక గుర్తింపు కల్పించారని,గిరిజన ప్రాంతాల్లో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యా అవకాశాలను విస్తరించారని తెలిపారు.పోడు భూముల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టి అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలోనే గిరిజనులకు నిజమైన గుర్తింపు లభించిందని, తండాలను పంచాయతీలుగా మార్చడం,10 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా గిరిజన బిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పించారని అన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కుమారి బిందు అంగోత్,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎం.డి.ఫరీద్,మాజీ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ నాయక్,ఐలి నరహరి గౌడ్,బోడ శ్రీను నాయక్,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతకు పకడ్బందీ చర్యలు : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో రహదారి భద్రతను మరింత పటిష్టం చేసి, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా .అధికారులను ఆదేశించారు.ప్రమాదాల్లో గాయపడిన వారికి గోల్డెన్ అవర్‌లోనే అత్యవసర వైద్యం అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్తో కలిసి జిల్లా రహదారి భద్రత కమిటీ సమన్వయ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాతీయ, ప్రధాన రహదారుల పై ప్రమాదాల నివారణ, అనధికార పార్కింగ్‌లు, సైనేజ్, లైటింగ్, సర్వీస్ రోడ్లు, వాహనాల వేగ నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించారు. జాతీయ రహదారి 163 పై ఎల్‌ఈడీ లైటింగ్, సైనేజ్ అప్‌గ్రేడేషన్, పట్టణానికి సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు వివరించారు. కోమల్ల టోల్‌ప్లాజా, కరు




ణాపురంలోని మద్యం దుకాణాలు, జనగామ రైల్వే స్టేషన్ వద్ద అనధికార పార్కింగ్‌లను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఘనపూర్ (స్టేషన్), చిన్న పెండ్యాల,కరుణాపురం ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్.ఓ.బి) పనులను వేగవంతం చేయాలని సూచించారు. వాహనాల వేగ నియంత్రణకు అవసరమై న ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్, థర్మోప్లాస్టిక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ఎల్ల మ్మ దేవాలయం వద్ద తగిన లైటింగ్ కల్పించాలని తెలిపారు.అన్ని పాఠశాల బస్సుల్లోసీ.సీ కెమెరాలు ఏర్పాటు చే యడంతో పాటు ఇప్పటికే ఉన్న కెమెరా ల పనితీరును తనిఖీ చేయాలని,విద్యా ర్థుల రవాణా భద్రతపై ప్రత్యేక దృష్టి సా రించాలని కలెక్టర్ సూచించారు. ప్రమా ద బాధితులను సమీప అత్యవసర వై ద్య సేవల ఆసుపత్రులకు తక్కువ సమయంలో తరలించేందుకు గ్రీన్ ఛానల్, ఆసుపత్రుల మ్యాపింగ్,రూట్ మ్యాపింగ్ సిద్ధం చేయాలని ఆదేశించారు.పెంబర్తివైజంక్షన్ వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు, నవాబుపేట కర్వ్ వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వేగ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తెలిపారు. సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఏ సీపీ భీం శర్మ, ఆర్టీఏ సభ్యులు చిలువే రు అభి గౌడ్,ఎన్‌హెచ్ఏఐ అధికారులు,మున్సిపల్ కమిషనర్లు రాజశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ వాణిశ్రీ, డీపీఓ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అంగన్వాడీలే పునాది

* చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యపై అవగాహన

ప్రజాస్ఫూర్తి ,జన్నారం : చిన్నారుల విద్యా, శారీరక, మానసిక అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలే పునాది అని తపాలాపూర్ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. పోషణ మాసం సందర్భంగా బుధవారం జన్నారం మండలంలోని తిమ్మాపూర్ అంగన్వాడీ కేంద్రం 2లో పోషణ మాసం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, మహిళలకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, శిశువుకు తల్లిపాల ప్రాధాన్యత, చిన్నారులకు అందించవలసిన



పోషక విలువలతో కూడిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పండ్లు తదితర పోషకాహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రాథమిక విద్యతో పాటు ఆటలు, పాటలు, కథలు, బోధనోపకరణాల ద్వారా నేర్చుకునే అవకాశాలు కల్పిస్తున్నట్లు సూపర్వైజర్ వెంకటలక్ష్మి తెలిపారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.

హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : రాపర్తి రాజు

జనగామ, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోళ్ల ప్రారంభానికి ముందే హమాలి యూనియన్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ హమాలి వర్కర్స్ జనగామ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, డీఆర్డీఓ ఆర్.భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు మాట్లాడుతూ ఐకేపీ నిర్వాహకులు ఏకపక్షంగాఒప్పందపత్రాలురూపొందించి



కార్మికులతో బలవంతంగా సంతకాలు చేయించడం సరికాదన్నారు. హమాలి కూలీ డబ్బులను రైతుల నుంచి కాకుండా ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, యూనిఫాంలు అందించడంతో పాటు పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి పరిశీలన చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు రాజు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బైరగోని బాలరాజు, నాయకులు గజ్జెల్లి రమేష్, కొంగరి నర్సయ్య,మద్దూరి యాదగిరి, పెండ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

GO.77 బీమా పథకం వెంటనే అమలు చేయాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:జెట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ http://GO.Ms.No.77 ప్రకారం ప్రమాద బీమా ప్రయోజనం కల్పించాలని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ జెట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ఉపాధి అధికారి టి. రజితను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం,25062026న జారీ చేసిన http://GO.Ms.No.77 ద్వారా జెట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు.ఆహాన్ ఏజెన్సీతో సహా పలు ఏజెన్సీలు ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న 16బ్యాంకుల్లో నమోదు కాకపోవడం వల్ల మహబూబాబాద్, డోర్నకల్,తొర్రూరు స్కూల్స్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు శాలరీ అకౌంట్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో బీమా ప్రయోజనం అందడంలో ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల పిజిటి ఉద్యోగి షేక్ గౌస్ మియా రైలు ప్రమాదంలో మృతి చెందారని,ఆయనకు కూడా ఖాతా లేకపోవడంతో కుటుంబానికి బీమా అందే పరిస్థితి లేదని తెలిపారు.ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.వినతి పత్రాన్ని స్వీకరించిన జిల్లా ఉపాధి అధికారి టి.రజిత,అర్హులైన ప్రతి ఉద్యోగికి బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని, ఏజెన్సీలకు సూచనలు ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇమాముద్దీన్ మొహమ్మద్, మహమ్మద్ సాజిద్, డి. రమేష్,సి.హెచ్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో 'పౌర హక్కుల దినోత్సవం'

53

కూకట్పల్లి,ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు బాలానగర్ తహసీల్దార్ ఆధ్వర్యంలో బుధవారం రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 'పౌర హక్కుల దినోత్సవం' (సివిల్ రైట్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) నాగమణి నేతృత్వంలో నిబంధనల ప్రకారం జరిగిన ఈ కార్యక్రమంలో బాలానగర్ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) మనోహర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, స్థానిక దళిత నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ నాగమణి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పౌర హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన సమగ్ర వివరాల నివేదికను వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులను ఆమె కోరారు. సమాజంలో అసమానతలు, అస్పృశ్యత నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. బాధితులకు తగిన న్యాయం చేయడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న చట్టపరమైన అవకాశాలపై అధికారుల బృందం స్థానికులకు సంపూర్ణ అవగాహన కల్పించింది.

బాహ్య మూల్యాంకనం అశాస్త్రీయం.. తక్షణమే రద్దు చేయాలి

: డి. శ్రీనివాస్



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు హోమ్ ఎగ్జామ్స్‌కు బాహ్య మూల్యాంకనం (ఎక్సటర్నల్ ఏవాల్యుయేషన్) ప్రవేశపెట్టాలన్న విద్యాశాఖ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా అధ్యక్షులు ఎన్.ఎన్.రాజు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉపాధ్యాయుల కొరత,మౌలిక వసతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా అకస్మాత్తుగా బాహ్య మూల్యాంకన విధానాన్ని అమలు చేయడం వల్ల విద్యార్థుల పై మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికే ఎఫ్.ఎల్.ఎన్, సీసీఈ, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ వంటి పనులతో ఉపాధ్యాయుల బోధనా సమయం తగ్గిపోతోందన్నారు. ఎలాంటి ముందస్తు ప్రణాళిక, తగిన వనరులు లేకుండా కొత్త విధానాన్ని అమలు చేయడం సరికాదని,విద్యా శాఖ నిర్ణయాన్ని పునఃసమీక్షించి తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అంకుషావలి, రాష్ట్ర కౌన్సిలర్ కుర్రెముల యాదగిరి, మాజీ అధ్యక్షులు బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నోరా స్పెషల్ సాంగ్

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహీ స్పెషల్ సాంగ్‌లో సందడి చేయనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ పాటను మేకర్స్ విడుదల చేశారు. అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ సాంగ్ ఫుల్ ఎనర్జిటిక్ బీట్‌తో, నోరా ఫతేహీ గ్లామర్, స్టెప్పులతో ఆకట్టుకునేలా ఉన్నది. నోరా ఫతేహీ స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విద్యాబాలన్, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, ఎస్‌జే సూర్య, యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.



డైరెక్షన్‌పై మనసుపడ్డ చిట్టి

'జాతిరత్నాలు' సినిమాతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా.. నటిగా విభిన్న పాత్రలతో అలరిస్తోంది. హీరోయిన్‌గానే కాకుండా స్పెషల్ సాంగ్స్, కామియోస్, సపోర్టింగ్ రోల్స్ చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నటనతో పాటు దర్శక త్వం వహించాలన్నది తన ఆశ యమని తాజా గా ఫరియా వెల్లడిం చింది. డైరెక్ట ర్‌గా తన తొలి సినిమాకు సంబంధించిన స్క్రి ప్ట్ పనులను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. ఇప్పటికి ప్పుడే డైరెక్టర్‌గా మారే ఆలోచన మాత్రం లేదని స్పష్టం చేసింది. తన ఆలోచనలకు తగ్గట్టుగా కథను పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు సమయం తీసుకోవాలను కుంటోంది. స్క్రిప్ట్ సంతృప్తి నిచ్చే స్థాయికి వచ్చిన తర్వాతే నిర్మాతలకు వివరించా లని అనుకుంటోంది. ప్రస్తుతం పూర్తిగా కథా రచనపైనే దృష్టి సారించిన ఆమె.. స్క్రిప్ట్‌పైనే దృష్టి పెట్టింది.

పెళ్లికి టైమ్ ఉందట!

టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల పెళ్లిపై మరోసారి క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం తన వయసు 25 ఏళ్లు కాగా.. ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని స్పష్టం చేసింది. గతంలోనూ కొన్ని సంవత్సరాల తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని చెప్పిన సంగతి తెలిసిందే. ఓ బాలీవుడ్ యువ హీరోతో శ్రీలీల పెళ్లి అంటూ అప్పట్లో వార్తలు వచ్చినా.. అవన్నీ నిజం కాదని తేలిపోయాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన శ్రీలీల.. భవిష్యత్తులో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటే, తనకు నచ్చిన లక్షణాలు ఉన్న వ్యక్తినే జీవిత భాగస్వామిగా ఎంచుకుంటానని చెప్పింది. ప్రస్తుతం మాత్రం పూర్తిగా కెరీర్‌పైనే దృష్టి పెట్టింది. ధనుష్ నటిస్తున్న 'ఓం'తో పాటు ఓ బాలీవుడ్ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. తెలుగులో తన తదుపరి చిత్రాన్ని ఇంకా ప్రకటించలేదు. ప్రస్తుతానికి పెళ్లి కంటే సినిమాలపైనే శ్రీలీల ఫోకస్ అన్నమాట.

కొత్త జాన్వీని చూస్తాం!

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ప్రస్తుతం కెరీర్ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. 'పెద్ది' సినిమా విడుదల తర్వాత ప్రమోషనల్ కార్యక్రమాలకు పెద్దగా హాజరుకావడం లేదు. సినిమాలో తన పాత్రను గ్లామర్ కోణంలో చూపించిన తీరుపై జాన్వీ అసంతృప్తిగా ఉన్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇక బాలీవుడ్‌లోనూ వరుసగా సినిమాలు అంగీకరించకుండా.. మంచి పాత్రల కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. గ్లామర్, కమర్షియల్ రోల్స్ కంటే నటనకు ప్రాధాన్యం ఉన్న బలమైన పాత్రలు చేయాలని ఆమె భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అల్లు అర్జున్ నటించనున్న 'రాకా'లో జాన్వీ హీరోయిన్‌గా నటించనుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు.



కయదుకు నిరాశే..

వరుస సినిమాలతో బిజీగా ఉన్న హీరోయిన్ కయదు లోహర్‌కు మాత్రం సరైన బ్రేక్ దక్కడం లేదు. నాని హీరోగా నటించిన 'ది ప్యారడైజ్'పై భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ.. ఇందులో ఆమె పాత్రకు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం దక్కలేదనే టాక్ వినిపిస్తోంది. కథతో పెద్దగా సంబంధం లేని పాత్రకే పరిమితమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది 'ఫంకీ', 'పల్లీ చట్నాంబి', 'ఐయామ్ గేమ్', 'హృదయం మురళి' వంటి చిత్రాలతో వరుసగా ప్రేక్షకుల ముందుకు వచ్చినా.. కెరీర్‌ను మలుపు తిప్పే హిట్ మాత్రం దక్కలేదు. ప్రస్తుతం శివకార్తికేయన్, సూర్య వంటి స్టార్ హీరోలతో తమిళ చిత్రాల్లో నటిస్తున్న కయదు.. కోలీవుడ్‌లోనైనా తనకు కావాల్సిన బ్రేక్ రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.



ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 1-10-2026 | సంపుటి - 31 | సంచిక - 129 | రూ : 4 | పేజీలు: 8



హైదరాబాద్‌కు దిగ్గజ అమెరికా సంస్థ

'డోర్ డాష్'

- భారత్‌లో తొలి కార్యాలయం ఏర్పాటు
- తొలిదశలో 500 మందికి ఉద్యోగావకాశాలు
- రెండేళ్లలో 3,000 మందికి విస్తరణ
- కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రముఖ లోకల్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'డోర్ డాష్' భారత్‌లో తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. ప్రస్తుతం 500 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ... వచ్చే రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 3,000 మందికి పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రంలో ప్రారంభ దశలో కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ఇంటెగ్రిటీ (సీఎక్స్ఐ), జనరల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు పనిచేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా సంస్థకున్న అంతర్గత సీఎక్స్ఐ సర్వీస్ సెంటర్లలో హైదరాబాద్‌లోని కేంద్రం మూడోది. అమెరికాలోని టెంపీ, అలాగే మెక్సికోలోని మెక్సికో సిటీ తర్వాత హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా తమ తరువాయి 2లో

మీకు ఫామ్‌హౌస్‌లు

ఎక్కణ్నుంచి వచ్చాయి?

మీ కుటుంబసభ్యులందరి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయండి

- కేటీఆర్‌ను డిమాండ్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- హైటెక్ సిటీ వద్ద కేటీఆర్ కుటుంబానికి మూడు ఫైవ్ స్టార్ హోటళ్లున్నాయని ఆరోపణ
- సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారని మండిపాటు
- నేతన్నల ఆత్మహత్యలు, వలసలు ఎందుకు ఆపలేకపోయారని నిలదీత



2లో



ఇకపై ఇంటర్నెట్ లేకుండానే

మొబైల్‌లో లైవ్ టీవీ..!


- D2M టెక్నాలజీ అమలుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు
- వాణిజ్య అమలు కోసం అక్టోబర్‌లో RFP జారీ
- మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం

మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్‌టుమొబైల్' (D2M) అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు. ఏంటీ D2M టెక్నాలజీ? D2M అనేది బ్రాడ్‌కాస్టింగ్, తరువాయి 2లో

ఏపీలో SIR గడువు

అక్టోబర్ 10 వరకు పొడిగింపు

- అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం
- అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం
- కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం



ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార తరువాయి 2లో

రష్యా సైన్యంలో చేరొద్దు

కేంద్రం హెచ్చరిక

- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ

2లో





క్రాకర్స్‌పై సుప్రీం ఊరట..

పూర్తి నిషేధం కాదు!

- 24 గంటల పాటు కాల్చేందుకూ అనుమతించలేని స్పష్టీకరణ
- నిర్దిష్ట సమయాలపై నిబంధనలు వచ్చే అవకాశం
- గ్రీన్ క్రాకర్స్‌కు షరతులతో అనుమతికి సూచన
- బేరియం క్రాకర్స్‌పై సీపీసీబీ నివేదిక పెండింగ్
- తదుపరి విచారణ అక్టోబర్ 15న

దీపావళి వేళ బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాణసంచాపై పూర్తిగా నిషేధం విధించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో రోజంతా ఎలాంటి పరిమితులు లేకుండా కాల్చేందుకు కూడా అనుమతించలేమని తేల్చి చెప్పింది. తరువాయి 2లో

యూఎస్ వీసా పిడుగు

డబుల్‌కైన ఇన్వెస్టర్ ఫీజులు!

- అమెరికా ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ నిర్ణయం
- భారతీయ పెట్టుబడిదారులలో గ్రీన్ కార్డ్ కోసం ఇది ఒక మార్గం
- కొన్ని దరఖాస్తు ఫీజులు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగిన వైనం



2లో

మోదీ-ట్రంప్ ఫోన్ కాల్

వాణిజ్యం, రక్షణపై చర్చ

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహితసంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం



ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్ అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. తరువాయి 2లో

మీకు ఫామ్‌హౌస్‌లు ఎక్కణ్నుంచి వచ్చాయి?

సిరిసిల్ల: కేటీఆర్ తన ఆస్తులతో పాటు.. కేసీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావు ఆస్తులపై కూడా శ్వేతపత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ''సిరిసిల్ల భూములపై కేటీఆర్ శ్వేతపత్రం అడుగుతున్నారు. మీది.. మీ తండ్రిది.. సంతోష్‌రావు, హరీశ్‌రావు, మీ బంధువుల ఆస్తులపై శ్వేతపత్రం ఇవ్వండి. జన్వాడలో కేటీఆర్ ఫామ్‌హౌస్, శంకర్‌పల్లిలో కవిత ఫామ్‌హౌస్, మొయినాబాద్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌస్, ఎర్రవల్లిలో కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్నాయి కదా? ఇవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయి?'' అని సీఎం ప్రశ్నించారు. హైటెక్ సిటీ వద్ద కేటీఆర్ కుటుంబానికి మూడు ఫైవ్ స్టార్ హోటళ్లున్నాయని, దాదాపు 400 రూములుండే ఈ హోటళ్లు ఎక్కడ్నించి వచ్చాయో కేటీఆర్ సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్, కేటీఆర్, సంతోష్‌రావులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారని మండిపడ్డారు.అంతకుముందు సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా నుంచి రంగినేని ట్రస్ట్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వరకూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు, పార్టీ నాయకులు, వందల మంది కార్యకర్తలతో కలిసి సుమారు 3 కి.మీ. పాదయాత్ర చేశారు. అనంతరం సభా వేదిక వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బహిరంగసభలో సీఎంతోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహమ్మద్ అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఓట్లను నోట్లుగా మార్చుకున్నారు..

సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. ''ధైర్యం, దైవం కలిసి వెలిసిన ప్రాంతం సిరిసిల్ల. వస్త్ర పరిశ్రమకు అసలైన చిరునామా. వేల కుటుంబాల వారు చేనేతను నమ్ముకొని జీవిస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారిది. కానీ పదేళ్ల భారాస పాలనలో సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చేశారు. సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డి ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని నిర్మించారు. 2009 ఎన్నికల్లో ఆయనకు న్యాయంగా టికెట్ ఇస్తే.. 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిచేవారు. కానీ కేసీఆర్... తన కుమారుడిని బరిలో నిలిపారు. బొటాబొటీగా 172 ఓట్లతో కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యారు. మీరు వేసిన వేలాది ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకొని.. వందల ఎకరాల భూములను సమకూర్చుకొని.. ధనిక కుటుంబంగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమాన్ని, సిరిసిల్ల ప్రజల శ్రమను సంపదగా మార్చుకొని.. విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. 2009 నుంచి 2026 వరకూ ఇక్కడ ఆరుసార్లు ఎన్నికల్లో మీరు కేటీఆర్‌ను గెలిపించారు కదా? మరి నేత కార్మికుల ఆత్మహత్యలు, గల్ఫ్ వలసలను ఎందుకు ఆపలేకపోయారు? మా ప్రభుత్వం వచ్చాక.. గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి పెట్టాం. కార్మికులు గల్ఫ్ ప్రాంతాల్లో చనిపోతే.. ఆ కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందజేసే పథకాన్ని తెచ్చాం.

*** సంతోష్‌రావు ఆగర్భ శ్రీమంతుడు ఎలా అయ్యారు?**

కేటీఆర్, కేసీఆర్ తోడల్లుడు రవీందర్‌రావు, ఆయన కుమారుడు సంతోష్‌రావులు రూ.లక్షల కోట్ల సంపద దోపిడీ చేసింది వాస్తవం కాదా? ఇసుక లారీలకు అడ్డం వచ్చారని దళిత సోదరులను లారీలతో తొక్కించింది నిజం కాదా? ఆ బలహీన వర్గాల పిల్లలకు కరెంటు షాక్ ఇచ్చింది నిజం కాదా? మిడ్‌మానేరులో ఇల్లు పోయిందని.. 2015లో రవీందర్‌రావు, సంతోష్‌రావు, సౌమ్యారావు.. ముంపు బాధితుల ప్యాకేజీ సొమ్మును కొల్లగొట్టారు. తెల్ల రేషన్‌కార్డు తీసుకొని ఇళ్ల పట్టాలు పొందారు. అలాంటి సంతోష్‌రావు ఇప్పుడు ఆగర్భ శ్రీమంతుడెలా అయ్యారు? వందల ఎకరాల భూములు, టీవీ, పేపర్లు, ఫైవ్ స్టార్ హోటళ్లు ఎలా వచ్చాయి?

ఇకపై ఇంటర్నెట్ లేకుండానే మొబైల్‌లో లైవ్ టీవీ!

మొబైల్ ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్ చూడటానికి ఇకపై ఇంటర్నెట్ డేటా లేదా వైఫై అవసరం లేదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 'డైరెక్ట్‌టుమొబైల్' (D2M) అనే సరికొత్త టెక్నాలజీని వాణిజ్యపరంగా అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా సిమ్ కార్డు, డేటా కనెక్షన్ లేకపోయినా నేరుగా మొబైల్‌లోనే టీవీ ప్రసారాలను వీక్షించవచ్చు.

ఏంటీ D2M టెక్నాలజీ?

D2M అనేది బ్రాడ్‌కాస్టింగ్, బ్రాడ్‌బ్యాండ్ కలయికతో పనిచేసే సాంకేతికత. దీని ద్వారా ఎలాంటి ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే లైవ్ టీవీ, వీడియోలు, ఇతర మల్టీమీడియా కంటెంట్‌ను నేరుగా మొబైల్స్‌కు ప్రసారం చేయవచ్చు. ముఖ్యంగా ఇంటర్నెట్ సిగ్నల్స్ బలహీనంగా ఉండే గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రసార భారతి, ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్ (గతంలో సాంఖ్య ల్యాబ్స్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి. వాణిజ్యపరమైన అమలు కోసం అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (RFP) జారీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 470 582 MHz స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో ఈ ప్రసారాలు జరుగుతాయని, దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి అంతరాయం ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు. అయితే, ఈ టెక్నాలజీ విస్తృత వినియోగానికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. D2M ప్రసారాలను స్వీకరించేందుకు ఫోన్లలో ATSC 3.0 ప్రమాణాలకు అనుగుణమైన హార్డ్‌వేర్ ఉండాలి. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చాలా స్మార్ట్‌ఫోన్లు దీనికి సపోర్ట్ చేయవు. మరోవైపు, ఈ టెక్నాలజీ వల్ల తమ డేటా ఆదాయానికి గండి పడుతుందని టెలికాం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

హైదరాబాద్‌కు దిగ్గజ అమెరికా సంస్థ 'డోర్ డాష్'

హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రముఖ లోకల్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'డోర్ డాష్' భారత్‌లో తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. ప్రస్తుతం 500 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ... వచ్చే రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 3,000 మందికి పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రంలో ప్రారంభ దశలో కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ఇంటెగ్రిటీ(సీఎక్స్ఐ), జనరల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు పనిచేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా సంస్థకున్న అంతర్గత సీఎక్స్ఐ సర్వీస్ సెంటర్లలో హైదరాబాద్‌లోని కేంద్రం మూడోది. అమెరికాలోని టెంపీ, అలాగే మెక్సికోలోని మెక్సికో సిటీ తర్వాత హైదరాబాద్‌లో ఈ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలకు హైదరాబాద్ కేంద్రం కీలకంగా వ్యవహరించనుందని సంస్థ ప్రకటించింది. వినియోగదారులు, వ్యాపారులు, డెలివరీ భాగస్వాములకు మెరుగైన సేవలు అందించడంలో ఇది క్రియాశీలకంగా వ్యవహరించనుంది. డోర్ డాష్ ప్లాట్‌ఫామ్‌కు ప్రపంచవ్యాప్తంగా 5.6 కోట్లకు పైగా నెలవారీ యాక్టివ్ వినియోగదారులున్నారు. 40కిపైగా దేశాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2025లో సంస్థ మార్కెట్‌ప్లేస్ గ్రాస్ ఆర్డర్ విలువ 100 బిలియన్ డాలర్లకు పైగా నమోదైంది. హైటెక్ సిటీలో సంస్థ కార్యాలయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం ప్రారంభించారు.

*** 2029 నాటికి జీసీసీల్లో 10 లక్షల ఉద్యోగావకాశాలు!**

ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ''ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 500 జీసీసీలున్నాయి. మరో 100 దాకా ఏర్పాటు చేసి.. లక్షకు పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు, 3 లక్షలకు పైగా పరోక్ష ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని జీసీసీల్లో 5 లక్షల మందికిపైగా పనిచేస్తుండగా.. 2029 నాటికి ఈ సంఖ్య 10 లక్షలకు చేరుతుందని అంచనా. ఫార్చ్యూన్ 500 సంస్థలు, కొత్త జీసీసీలను ఆకర్షిస్తున్న భారతీయ నగరాల్లో హైదరాబాద్ కీలక స్థానాన్ని కొనసాగిస్తోంది. హైదరాబాద్ జీసీసీ ఎకోసిస్టమ్‌లోకి తాజాగా డోర్ డాష్ ఆగమనంతో హైపర్ లోకల్ డిజిటల్ కామర్స్ రంగం కూడా చేరినట్లైంది. హైదరాబాద్‌లో డోర్ డాష్ పెట్టుబడి.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల రంగానికి ముఖ్యమైన పరిణామం. ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకోవడం..నగరంలోని ప్రతిభ, సాంకేతిక సామర్థ్యాలకు గుర్తింపు. 3,000 మందికి పైగా ఉద్యోగులతో కేంద్రం విస్తరించడం ద్వారా హైపర్ లోకల్ కామర్స్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, టెక్నాలజీ, ఆపరేషన్స్ రంగాల్లో గ్లోబల్ సామర్థ్యాలు హైదరాబాద్‌కు తరలివస్తాయి'' అని పేర్కొన్నారు. డోర్ డాష్ సీఎఫ్ఓ రవి ఇనుకొండ, వర్క్‌ఫోర్స్ స్ట్రాటజీ అండ్ టాలెంట్ ఎక్విజిషన్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ జెన్నా కోహ్నెకె, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రష్యా సైన్యంలో చేరొద్దు: కేంద్రం హెచ్చరిక

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది. అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

మోదీ-ట్రంప్ ఫోన్ కాల్: వాణిజ్యం, రక్షణపై చర్చ

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్ అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్ అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్ అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియాయూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్ అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

క్రాకర్స్‌పై సుప్రీం కీలక తీర్పు..

పూర్తి నిషేధం కాదు..!

దీపావళి వేళ బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బాణసంచాపై పూర్తిగా నిషేధం విధించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో రోజంతా ఎలాంటి పరిమితులు లేకుండా కాల్చేందుకు కూడా అనుమతించలేమని తేల్చి చెప్పింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి.వరాలేతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. దీపావళితో ముడిపడిన మతపరమైన భావాలను గౌరవిస్తూనే.. వాయు కాలుష్యం వల్ల పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి ఎదురయ్యే ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది.

సమయాన్ని నిర్దేశించే అవకాశం

బాణసంచా వినియోగానికి నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించే దిశగా సుప్రీంకోర్టు మొగ్గు చూపింది. ఏ రకమైన బాణసంచాను ఉపయోగించాలన్న దానిపైనా నిబంధనలు విధించే అవకాశం ఉందని తెలిపింది. తదుపరి తరం జాయింట్ గ్రీన్ క్రాకర్స్‌లో నిర్దిష్ట రకాల బాణసంచాకు అనుమతి ఇవ్వడంపై కోర్టు సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది. అయితే వాటి తయారీ విధానం, శబ్ద స్థాయి, షెల్స్ సంఖ్య, పరిమాణం, వరుసగా బాణసంచా కాల్చే మధ్య వ్యవధి వంటి అంశాలపై నిబంధనలు విధించనుంది.

బేరియం బాసంచాపై ఇంకా పరీక్షలు

బేరియం ఆధారిత బాణసంచా వల్ల పర్యావరణంపై పడే ప్రభావంపై కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నివేదికను సమర్పించేందుకు కేంద్రం మరింత సమయం కోరింది. బేరియం ఆధారిత బాణసంచాపై బహిరంగ ప్రదేశంలో పరీక్షలు ఇంకా జరగలేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. అక్టోబర్ 15 వరకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో కేంద్రం, నిపుణుల సంస్థలు తమ అంచనాలను పూర్తి చేసేందుకు సుప్రీంకోర్టు సమయం ఇచ్చింది. ఈ అంశంపై తదుపరి విచారణ అక్టోబర్ 15న జరగనుంది.

*** ఢిల్లీ-ఎన్‌సీఆర్ అంశంపై ఇప్పుడే ఆదేశాలు లేవు**

బాణసంచాపై పెండింగ్‌లో ఉన్న కొన్ని అంశాలు ఢిల్లీ ఎన్‌సీఆర్‌కు సంబంధించిన ఎం.సి. మెహతా కేసులో విచారణలో ఉన్న అంశాలతో ముడిపడి ఉన్నాయని సుప్రీంకోర్టు గుర్తించింది. ఈ అంశాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించేందుకు పార్టీలకు అనుమతి ఇచ్చింది. అవసరమైతే రెండు కేసుల్లోని ఉమ్మడి అంశాలను కలిపి విచారించే అవకాశం ఉంటుంది. అయితే ఢిల్లీఎన్‌సీఆర్ అంశంపై ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు ఇవ్వబోమని జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం కోరుతూ దాఖలైన ఇతర పిటిషన్లను మాత్రం విచారించనుంది.

యూఎస్ వీసా పిడుగు: డబులైన ఇన్వెస్టర్ ఫీజులు!

అమెరికాలో పెట్టుబడులు పెట్టి, శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) పొందాలనుకునే విదేశీయులకు, ముఖ్యంగా భారతీయులకు ఇది కీలకమైన పరిణామం. భారతీయ పారిశ్రామికవేత్తలు, కుటుంబాలు ఎక్కువగా ఆసక్తి చూపే ఈబీ5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ఫీజుల నిబంధనను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) మంగళవారం ఖరారు చేసింది. నూతన ఫీజులు ఈ ఏడాది నవంబర్ 30 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఏమిటీ ఈబీ-5 ప్రోగ్రామ్?

అమెరికాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా 1990లో ఈబీ5 ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ పథకం కింద విదేశీ పెట్టుబడిదారులు అమెరికాలోని వాణిజ్య సంస్థలలో నిర్దిష్ట మొత్తంలో పెట్టుబడి పెట్టి, కనీసం 10 మంది అమెరికన్లకు పూర్తికాల ఉద్యోగాలు కల్పించాలి. ప్రస్తుతం ఈ పెట్టుబడి మొత్తం అర్హత కలిగిన వ్యాపారంలో 1.05 మిలియన్ డాలర్లుగా, టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో అయితే 8 లక్షల డాలర్లుగా ఉంది. ఈ నిబంధనలు పాటిస్తే, పెట్టుబడిదారుడు, వారి జీవిత భాగస్వామి, అర్హులైన పిల్లలు గ్రీన్ కార్డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీలో SIR గడువు పొడిగింపు.. అధికారులకు కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నోమ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.